# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 20-05-2022 ₹15/-









సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక

## GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in

సంపుటి 44 సంచిక: 20 హైదరాబాద్
శుక్రవారం 20 మే 2022 రూ.15-00
18 షవ్వాల్ 1443 హిజ్రీ


**తొలిగీటు**

'ఎవరి హృదయాల్లోనైతే సాటి మనుషుల పట్ల కారుణ్యం ఉండదో, ఇతరుల పట్ల సానుభూతి ఉండదో, అలాంటి వారిని అల్లాహ్ తన ప్రత్యేక కరుణకు దూరంగా ఉంచుతాడు.'

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
ఎస్.ఎమ్. మలిక్

**అసోసియేట్ ఎడిటర్**
అబ్దుల్ వాహెద్

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
ముహమ్మద్ ముజాహిద్

**సబ్ ఎడిటర్**
యాఖూబ్ షరీఫ్

**గ్రాఫిక్స్**
ఎల్. లక్ష్మీనారాయణ
ముహమ్మద్ రఫీఖ్


**సర్క్యులేషన్ మేనేజర్**
అబ్దుల్ జలీల్, 9704317015

**సేల్స్ మేనేజర్**
ముహమ్మద్ యాసీన్, 9700255736



Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com


కథ



8

**అల్లాహ్ దయ**

## లోపల...


| | | |
|---|---|---|
| జనాభా గలాభా | ...... | 04 |
| పరువు హత్యలు | ...... | 05 |
| చరితార్థులు- మాసుమా బేగం | ...... | 11 |
| గుండెల నిండా దైవభీతి నింపుకున్నారు | ...... | 12 |
| ఇస్లాంలో కుల వ్యవస్థకు తావే లేదు... | ...... | 14 |
| సామాజిక సేవ చేద్దాం! | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| మక్కాలో పున:ప్రవేశం-23 | ...... | 20 |
| ఈద్ మిలాప్ వేదికలు మత సామరస్యానికి ప్రతీకలు | ...... | 23 |
| మొబైల్ ముచ్చట్లు | ...... | 24 |
| రమజాన్ ఆశయమేది? | ...... | 28 |
| ఖుర్‌ఆన్‌ను ఎందుకు అధ్యయనం చేయాలి? | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| మోసకారులకు 'హావియా' నరకం | ...... | 34 |


**బిగ్ షాక్ ...**



మరోసారి కరంటోళ్ళు
పెంచినారు బిల్లులు
బాజాప్తగ జేబులకు
పెట్టినారు చిల్లులు!
పేద మధ్య తరగతికి
తగిలింది పెద్ద షాకు
దీపం వెలిగించు ఇక
కరంటు జోలికి పోకు!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

## ఆలోచన

# జనాభా గలాభా

**ముస్లిముల జనాభా** దేశంలో పెరిగిపోతుందనే గగ్గోలు మనం తరచూ వింటూనే ఉంటాం. 2015లో బీజేపీ ఎం.పీ సాక్షీ మహరాజ్ అందుకే హిందూ మహిళలకు ఒక సలహా ఇచ్చాడు. ముస్లిముల జనాభా పెరుగుదలకు దీటుగా హిందూ మహిళలు కనీసం నలుగురు పిల్లలకు జన్మనివ్వాలని పిలుపునిచ్చాడు. ఈ వార్త ఇప్పుడు చాలా మందికి గుర్తుండి ఉండకపోవచ్చు.

విద్వేష ప్రసంగాలు చేసినందుకు ప్రస్తుతం కేసు ఎదుర్కొంటున్న హిందూత్వ నాయకుడు యతినరసింగా నంద వంటి అనేక మంది ముస్లిం జనాభా పెరిగిపోతుం దంటూ, హిందువులు మైనారిటీ అయిపోతారంటూ సమాజంలో ఒక విధమైన భయవాతావరణం సృష్టించే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ జనవరి 2020లో మాట్లాడుతూ దేశంలో ముస్లిములకు లభించిన ప్రత్యేక హక్కుల వల్ల వారి జనాభా విపరీతంగా పెరిగిపోతుందన్నాడు.

కాని ఈ విద్వేష ప్రచారక నేతలు చెబుతున్న మాటలు నిజాలా?

ప్రముఖ రీసెర్చి సంస్థ ప్యూ సెంటర్ 2015లో ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రస్తుతమున్న జనాభా పెరుగుదల రేటు ప్రకారం చూస్తే హిందువుల జనసంఖ్యకు సమానమైన స్థాయిలో ముస్లిముల జనసంఖ్య పెరగాలంటే కనీసం రెండు వేల సంవత్సరాలు పడుతుంది. ఇది 2015లో ప్యూ సంస్థ అధ్యయనాల తర్వాత చెప్పిన మాట.

ఇప్పుడు పరిస్థితి మరింత మారింది.

ముస్లిముల జనాభా పెరుగుదల రేటు శరవేగంగా తగ్గి పోతోందని నివేదికలు వచ్చాయి. ముస్లిముల జనాభా పెరుగుదల రేటు చాలా వేగంగా తగ్గిపోతుందనే నివేదిక ఇచ్చింది మరెవరో కాదు, స్వయంగా నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే నివేదిక ఇది. గత రెండు దశాబ్దాలుగా ఇతర మతసముదాయాలతో పోల్చితే ముస్లిముల జనాభా పెరుగుదల రేటు చాలా వేగంగా పడిపోతోంది.

ముస్లిముల జనాభా పెరిగిపోతుందనేది ఉత్త పుకారు, విద్వేష ప్రచార ఎత్తుగడ మాత్రమే అని ఈ సర్వే నిరూపిస్తోంది. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ప్రకటించిన నివేదిక ప్రకారం 1992-93 సంవత్సరంలో ముస్లిముల జనాభా పెరుగుదల రేటు 4.4 ఉండేది. కాగా 2015-16 సంవత్సరంలో ఇది 2.6కు పడిపోయింది. తర్వాత 2019-2021 మధ్య కాలంలో 2.3కు తగ్గిపోయింది. అంటే ముస్లిముల జనాభా పెరుగుదల రేటు శరవేగంగా పడిపోతోంది. మిగిలిన మత సముదాయాల కన్నా ఎక్కువ వేగంగా తగ్గిపోతోంది. ఈ లెక్కన చూస్తే 2015లో ప్యూ ఇచ్చిన నివేదిక, రెండువేల సంవత్సరాల తర్వాత ముస్లిముల జనాభా హిందువుల జనాభాకు సమానంగా మారవచ్చునే నివేదిక కూడా బుట్ట దాఖలైనట్లే. ఎందుకంటే, ఇంత వేగంగా జనాభా పెరుగుదల పడిపోతున్నప్పుడు రెండువేల సంవత్సరాలకు కాదు, ఎన్ని వేల సంవత్సరాలు గడిచినా ముస్లిములు మెజరిటీ కావడ మన్నది జరగనే జరగదు. కేవలం మతరాజకీయాలు నడిపే విద్వేష నేతల ప్రచారం తప్ప ఇది మరేమీ కాదు.

1992-93లో హిందువుల జనాభా పెరుగుదల రేటు 3.3 ఉండేది. హిందూ, ముస్లిం జనాభా పెరుగుదల రేటులో వ్యత్యాసం 1.1 ఉండేది. జనాభా పెరుగుదల రేటు లేదా ఫర్టిలిటీ రేటు అంటే ఒక మహిళ తన జీవితకాలంలో ఎంత మంది పిల్లలకు జన్మనిస్తుందనే లెక్క. జనాభా పెరుగుదల రేటు పడిపోతున్న వేగాన్ని పరిశీలిస్తే ముస్లిముల్లో 46.5 శాతం ఉంది. ఇదే హిందువుల్లో 41.2 శాతం ఉంది. అంటే క్రమంగా ముస్లిం జనాభా తగ్గుతుంటే, హిందూ జనాభా పెరుగుతోంది.

మొత్తం దేశంలో జనాభా పెరుగుదల రేటు 2.2 నుంచి 2కు తగ్గిపోయింది.

ఏది ఏమైనా ముస్లిముల జనాభా పెరిగిపోతుందనే వాదనలో నిజం లేదని ఈ లెక్కలు చెబుతున్నాయి. ఇంత స్పష్టంగా ఈ లెక్కలు వచ్చిన తర్వాతైనా విద్వేష రాజకీయాలు నడిపే వారు ముస్లిం జనాభాపై గగ్గోలు ఆపుతారా? ✤

అబ్దుల్ వాహెద్




ఆష్రీన్ అనే అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకున్న నాగరాజును దారుణంగా చంపేశారు. హత్యకు పాల్పడింది ఆష్రీన్ సోదరుడు, ఆమె బంధువులు. ఈ హత్య తీవ్రంగా ఖండించదగింది.

జమాఅతె ఇస్లామీ హింద్ తెలంగాణా అధ్యక్షులు జనాబ్ హామిద్ ముహమ్మద్ ఖాన్ ఈ హత్యను తీవ్రంగా ఖండిస్తూ ఇది అమానుషమైన నేరమన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఈ హత్యను ఖండిస్తూ అత్యంత కిరాతకమైన నేరంగా చెప్పారు.

సరూర్ నగర్‌లో ఈ హత్య జరిగింది. హత్య జరిగిన తర్వాత నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

కానీ --

ఆ తర్వాత రాజకీయాలు ప్రారంభమయ్యాయి...

హైదరాబాదుకు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న బిల్లిపురం నాగరాజు స్వగ్రామం. దళిత కులానికి చెందిన వ్యక్తి. నాగరాజు తన చెల్లెలిని పెళ్ళాడడం సోదరుడు మొబీన్ అహ్మద్‌కు ఇష్టం లేదు. ఈ కారణమే హత్యకు దారితీసింది. ఇది స్పష్టంగా పరువు హత్య.

నాగరాజు తల్లిదండ్రులు బి. శ్రీనివాస్, అనసూయలకు మద్దతుగా ప్రారంభంలో స్థానిక అంబేద్కర్ యూత్ సంస్థ నిలబడింది. వారికి అవసరమైన సహాయసహకారాలు అందించింది. కాని రాజకీయ నాయకులు ఆ ఊరికి చేరుకున్న తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

నాగరాజు, ఆష్రీన్ ఇద్దరు రహస్యంగా ఆర్యసమాజ్‌లో పెళ్ళి చేసుకున్నారు. వారిద్దరి పెళ్ళి గురించి తెలిసిన వధువు సోదరుడు ఈ హత్యకు పాల్పడ్డాడు.

సరూర్ నగర్‌లో నాగరాజుపై దాడి జరిగింది. తర్వాత గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాని అప్పటికే నాగరాజు మరణించాడు. ఆసుపత్రి వద్ద బీజేపీ కార్యకర్తలు గుమికూడడం ప్రారంభమయ్యింది. పరువు హత్య ఇప్పుడు మతరాజకీయాలకు ఉపయోగించుకోవడం ప్రారంభమయ్యింది. నాగరాజు హిందువు, వధువు ఆఫ్రీన్ ముస్లిం అనేది మతరాజకీయాలకు కావలసిన ఇంధనాన్ని ఇస్తోంది.

బీజేపీ కార్యకర్తలు నాగరాజు మృతదేహం కోసం వచ్చిన ఊరి పెద్దలను, అంబేద్కర్ యూత్ సంఘం ప్రతినిధులను చేతులు చాచి ఆహ్వానించారు. జై భీమ్ నినాదాలు నెమ్మదిగా మందగించి జై శ్రీరామ్ నినాదాలు మిన్నంటడం ప్రారంభమయ్యింది.

నాగరాజు కుల గుర్తింపు కన్నా ఇప్పుడు మత గుర్తింపు ముఖ్యమైనదిగా మారింది. వాట్సప్ సందేశాలు చక్కర్లు కొట్టడం ప్రారంభమయ్యింది. సెక్యులర్లపై వెటకారాలు, బురదజల్లడాలు మొదలయ్యాయి.

మత రాజకీయాలు ప్రవేశించిన తర్వాత పూర్తి పరిస్థితి మారి పోయింది.

కాని ఇక్కడ మతం కన్నా కులం ముఖ్యకారణం అనేది గమనించాలి. స్వయాన నాగరాజు భార్య పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలం కూడా కులం కారణంగానే పరువు హత్య జరిగిందని స్పష్టం చేస్తున్నట్లు వార్తల్లో వచ్చింది. కాని తర్వాత రాజకీయాలు ఊపందుకున్నాయి.

ఇప్పుడు ఎవరూ నాగరాజు కులం గురించి మాట్లాడడం లేదు. కులం కారణంగా సమాజంలో లభించిన దిగువ స్థాయి గురించి మాట్లాడడం లేదు. అందరూ మాట్లాడుతున్నది ఇప్పుడు మతం గురించి. "మనము వర్సెస్ వాళ్ళు" అనే విభజనే ఇప్పుడు చర్చలకు కేంద్రమయ్యింది.

2018లో కూడా ఇలాంటి పరువు హత్యే జరిగింది. ప్రణయ్ అనే దళిత క్రయిస్తవ యువకుడు వైశ్యుల అమ్మాయి అమృతను పెళ్ళి చేసుకున్నాడు. ఈ పెళ్ళి ఇష్టం లేని తండ్రి ప్రణయ్‌ను హత్య చేయించాడు. అప్పుడు కుల వివక్ష గురించే చర్చలు జరిగాయి. కులం సృష్టించిన అసమానతలపైనే చాలా మంది మాట్లాడారు. మరోవైపు నిందితులకు మద్దతుగా వాదించేవారు కూడా ముందుకు వచ్చారు. నిందితుడు మారుతీరావుకు మద్దతుగా తల్లిదండ్రుల సంఘం ఒకటి ర్యాలీ కూడా తీసింది. మేజర్ అయినప్పటికీ ప్రేమ వివాహాల్లో తల్లిదండ్రుల అంగీకారం ఉండేలా చట్ట సవరణ చేయాలంటూ వినతీపత్రాలు సమర్పించారు. అప్పట్లో "మనము వర్సెస్ వాళ్ళు" అనే మతవిద్వేష ప్రచారం, వాట్సప్ సందేశాల చక్కర్లు, మతరాజకీయాలు ఎక్కడా కనిపించలేదు. కారణం చాలా స్పష్టంగా ఉంది.

పరువు హత్యలు ఒకటి కాదు, అనేకం జరిగాయి. ప్రణయ్ హత్య తర్వాత సంగారెడ్డిలో హేమంత్ హత్య కేసు కూడా పరువు హత్యయే. హైదరాబాదు ఎర్రగడ్డలో సందీప్, మాధవీలపై జరిగిన దాడికి కారణం కూడా కులమే. వారిద్దరి పెళ్ళిని ఒప్పుకోలేని వధువు బంధువులు దాడి చేశారు.

ఇలాంటి సంఘటనలు సమాజంలో వేళ్ళూనుకుపోయిన కుల వివక్షను చాటి చెబుతున్నాయి. కాని నాగరాజు కేసులో వధువు ముస్లిం కావడంతో మతరాజకీయాలు చొచ్చుకువచ్చాయి. ఈ రాజకీయాల వల్ల అసలు సమస్య కులవివక్ష మరుగున పడిపోతోంది.

ప్రణయ్ హత్య కేసులో దళిత సంఘాలు ప్రణయ్ కుటుంబానికి పూర్తి మద్దతుగా నిలిచాయి. కుల వివక్షను ప్రతిఘటించాయి. నాగరాజు హత్య కేసులో మతం, మతవిభజన, మతవిద్వేషాలు ప్రముఖంగా ముందుకు వస్తున్నాయి. ఈ తేడాను మనం గమనించాలి.

బహుజన సమాజ్ పార్టీ, మాల మహానాడు నాగరాజు హత్య కేసును ఖండించి కొంతవరకు నాగరాజు కుటుంబానికి మద్దతుగా నిలబడ్డాయి. కాని ఈ కేసులో దళిత సంఘాలు పెద్దగా కనిపించడం లేదు. బీజేపీ ప్రముఖంగా కనిపిస్తుంది.


# ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్

**భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.**

**తెలుగు - హిందీ - ఇంగ్లీష్ - తమిళం - కన్నడ - మరాఠీ - బెంగాలీ**

**భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.**

**ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,**

**ఉచితంగా దివ్యఖుర్ఆన్ కోసం సంప్రదించండి:**

**1800 572 3000**

ఇది కేవలం మతరాజకీయాలకు సంబంధించిన ప్రశ్న మాత్రమే కాదు. ఒక దళిత వ్యక్తిపై జరిగిన అఘాయిత్యం యస్సీ యస్టీ చట్టం క్రింద విచారించవలసిన కేసు. కాని ఇప్పుడు ఈ కేసు కోణమే మారిపోయింది. ఇక్కడ నిందితులు ముస్లిములు కాబట్టి మొత్తం కేసుకు మతం రంగు పులమడం రాజకీయంగా బీజేపీకి లాభిస్తుందనే రాజకీయ ఎత్తుగడే ముఖ్యంగా కనిపిస్తోంది.

నాగరాజు, ప్రణయ్ ఈ రెండు కేసులను మనం పరిశీలించ వలసిన అవసరం ఉంది. ప్రణయ్ కేసులో క్రయిస్తవ వరుడు, హిందూ అగ్రకులానికి చెందిన వధువు అనే మతవిభజన రాలేదు. ఈ నేరం దళితులపై జరిగిన నేరంగా వెంటనే గుర్తింపు పొందింది. కాని నాగరాజు కేసులో అలా జరగలేదు. వధువు ముస్లిం కావడంతో వెంటనే మతరాజకీయాలకు అవకాశం లభించింది. కులవివక్ష చర్చకు రావడమే లేదు.

ప్రణయ్ కేసులో అనేక దళిత సంఘాలు, కులవ్యతిరేక సంఘాలు ముందుకు వచ్చాయి. నీలి జెండాలు రెపరెపలాడాయి. కుల వివక్షకు వ్యతిరేకంగా నినాదాలు వినిపించాయి. ముఖ్యంగా ప్రణయ్ కుటుంబం రాజకీయ పార్టీలను దూరంగా ఉంచ గలిగింది.

కాని నాగరాజు కేసులో పరిస్థితి అలా లేదు. ముస్లిములు చేసిన నేరంగా సాధారణీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ విధంగా ముస్లిమ్ విద్వేషాన్ని ప్రచారం చేసి రాజకీయ ప్రయోజ నాలు సాధించుకునే ప్రయాసలో ఉన్నారు.

తమకు న్యాయం చేయాలని నాగరాజు తల్లిదండ్రులు, నాగరాజు భార్య కోరుతున్నారు. వారికి న్యాయం జరగాలి. అమానుషంగా హత్యకు గురైన నాగరాజు హంతకులను కఠినంగా శిక్షించాలి. కాని ఈ కేసులో కులం కోణాన్ని పక్కన పెడితే న్యాయం జరుగు తుందా?

అలాగే --

నాగరాజు కేసులో మతరాజకీయాలు సమాజంలో ఎలాంటి చిచ్చుపెడతాయన్నది కూడా గుర్తించవలసిన అవసరం ఉంది.

ఢిల్లీలో కూడా గతంలో ఇలాంటి ఒక కేసు ముందుకు వచ్చింది. అంకిత్ సక్సేనా కేసు.

అంకిత్ సక్సేనా ఒక ముస్లిం అమ్మాయిని ప్రేమించాడు. ఆయన తండ్రి యశ్‌పాల్ సక్సేనా కంటి ముందే అంకిత్ సక్సేనా హత్య జరిగింది. ఈ సంఘటన జరిగింది 2018లో. అప్పట్లో కూడా ఢిల్లీలో ఈ హత్యను మత విద్వేషాలకు, మతరాజకీయాలకు వాడుకునే ప్రయత్నాలు పూర్తి స్థాయిలో జరిగాయి. చంపినవారెవ్వరో స్పష్టంగా తెలుస్తూనే ఉంది. ఈ హత్యను రాజకీయాలకు వాడుకునే ప్రయత్నాలు పెద్ద ఎత్తున జరిగాయి. భజరంగదళ్ తదితర హిందూత్వ సంస్థలు రెచ్చగొట్టడానికి పూర్తి ప్రయత్నాలు చేశాయి. అంకిత్ సక్సేనా తండ్రి యశ్‌పాల్ సక్సేనా చాలా స్పష్టంగా "నా కుమారుడి హంతకులు ముస్లిములే. కాని ముస్లిములందరిపై ఆ నేరం మోపలేను. రెచ్చగొట్టే ప్రకటన చేయడం నాకిష్టం లేదు" అని చెప్పారు.

అప్పట్లో ఢిల్లీ బిజెపి అధ్యక్షుడు మనోజ్ తివారి రంగంలోకి దిగి అంకిత్ సక్సేనా కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరి హారం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఇది ఆర్గనైజెడ్ క్రయిమ్‌గా ప్రకటించాడు. కాని యశ్‌పాల్ సక్సేనా ఈ ఒత్తిళ్ళకు లొంగలేదు. ఈ హత్యను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుని జనాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలను తీవ్రంగా నిరసించారు.

యశ్‌పాల్ సక్సేనా అప్పుడు చూపించిన సంయమనం చాలా గొప్పది. తన కుమారుడి హంతకులకు ఆయన శిక్షపడాలనే కోరుకున్నాడు. కాని వారి మతాన్ని తాను ద్వేషించలేనని స్పష్టం చేశాడు. ముస్లిములందరినీ నేనెందుకు ద్వేషించాలంటూ స్పష్టంగా నిలదీసి అడిగాడు.

తన కుమారుడిని పోగొట్టుకున్న దుఃఖంలో కూడా సంయమ నాన్ని కోల్పోకుండ నిలబడిన యశ్‌పాల్ సక్సేనా వంటి వారు అనేకమంది ఉన్నారు.

అస్సాంలో అల్లర్లు జరిగినప్పుడు అసాన్సోల్‌లో మౌలానా రాషిది కుమారుడిని మతోన్మాదులు చంపేశారు. కాని ఆ హత్య తర్వాత అల్లర్లు పెచ్చరిల్లకుండా, శాంతిని కాపాడాలంటూ ఆయన అక్కడ గుమికూడిన ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగం కూడా ఇలాంటి సంయమనాన్నే చాటి చెప్పింది. మౌలానా రాషిద్ తన కుమారుడి హత్య తర్వాత, కుమారుడి మృతదేహం ముందు నిలబడి కూడా శాంతిని కాపాడ్డానికి చేసిన విజ్ఞప్తి ఎంత గొప్పదో, అంతకన్నా యశ్‌పాల్ సక్సేనా తన కుమారుడి హత్య తర్వాత ప్రలోభాలకు, ఒత్తిళ్ళకు లొంగకుండా శాంతిని కాపా డ్డానికి చేసిన ప్రయత్నం గొప్పది.

నాగరాజు హత్య అయినా, ప్రణయ్ హత్య అయినా మరో హత్య అయినా నేరస్థులను కఠినంగా శిక్షించాలి. కాని ఆ నేరం సమాజంలో విభిన్న సముదాయాల మధ్య చిచ్చుపెట్టడానికి సాధనం కారాదు. సంయమనాన్ని కోల్పోరాదు. ప్రజల్లో చిచ్చుపెట్టి రాజకీయ లాభాలు గడించడానికి పార్టీలు ప్రయత్ని స్తూనే ఉంటాయి. పార్టీల స్వార్థ రాజకీయాలను గుర్తించి జాగ రూకతతో వ్యవహరించవలసిన బాధ్యత మనందరిపై ఉంది. ✤

# అల్లాహ్ దయ



**ఖుర్షీద్ బేగం**

షరీఫ్ సాబ్‌కు ఉదయం నుంచి ఒంట్లో నలతగా ఉంది. ఛాతీలో నొప్పిగా అనిపిస్తుంది. ఎడమ చేయి కూడా లాగుతూ ఉంది. సాయంత్రం 5 గంటలకే తన పుస్తకాల షాప్ మూసేసి ఇంటికి వచ్చేశారు. భార్య హసీనాకు విషయం చెబితే ఆలస్యం చేయకుండా డాక్టర్ దగ్గరకు వెళ్ళమని ఒకటే గోల. ఆమె చెప్పేది నిజమే. ఈ రోజుల్లో హార్ట్ ప్రాబ్లమ్స్ ఎక్కువగా వస్తున్నాయి. కొంపదీసి తనకూ గుండె జబ్బు రాలేదుగా అనుకుని ఒకటే టెన్షన్‌గా ఉంది షరీఫ్ గారికి. వచ్చినా చేసేది ఏమీలేదు అంతా అల్లాహ్ దయ. జబ్బును ఇచ్చినా, నయం చేసినా, మరణం ఇచ్చినా అంతా ఆయన చేతిలోనే ఉంది. కేవలం మానవ ప్రయత్నం మాత్రమే మనం చేయాలి అని అనుకుంటూ నిద్రలోకి మెల్లగా జారుకున్నారు.

★★★

సిటీలోనే పెద్ద కార్పొరేట్ హాస్పిటల్‌లో ఎంతో పెద్ద కార్డియాలజిస్ట్‌గా పేరున్న డాక్టర్ సాదిక్ గురించి తెలిసింది. ఆయన హస్తవాసి చాలా మంచిదని జనాల్లో ఒక సెంటిమెంట్. ఆయన చూస్తే చాలు ఇంకా ప్రాణానికి ఏ ఢోకా లేదని నమ్మకం. వెంటనే షరీఫ్ హాస్పిటల్‌కు కాల్ చేశాడు డాక్టర్ అపాయింట్‌మెంట్ కోసం. డాక్టర్ గారు లేరండీ మెడికల్ కాన్ఫరెన్స్ కోసం ఢిల్లీ వెళ్ళారు అటునుంచి సమాధానం. సరే చేసేది లేక వేరే డాక్టర్ దగ్గర చూపించుకోవాలని డిసైడ్ అయిపోయారు. కానీ ఎందుకో మనసు ఎలాగైనా సరే ఒక్కసారి డాక్టర్ సాదిక్ దగ్గర చూపించుకుంటే మనసుకు నెమ్మదిగా ఉంటుందని అనిపించింది. మళ్ళీ వారం తర్వాత డాక్టర్ అపాయింట్‌మెంట్ కోసం కాల్ చేశారు. ఈసారి అపాయింట్‌మెంట్ దొరికింది. ఇక తన గుండెకు ఏ ఢోకా లేదనిపించింది.

ఉదయం 7 గంటలకే ఓ.పీ కోసం హాస్పిటల్ చేరుకున్నారు. అప్పటికే తన నెంబర్ 105 అంటే తనకన్నా ముందు దాదాపు ఓ వంద మంది ఉన్నారు. దాదాపు మధ్యాహ్నం 2 గంటలకు లంచ్ ముందు తన నంబర్ పిలిచింది నర్స్. డాక్టర్ సాదిక్ 50 సంత్సరాలకుపైబడిన వయసు. మనిషి ఎంతో హుందాగా ఉన్నారు. సిటీలోనే పెద్ద పేరున్న డాక్టర్ అన్న ఫీలింగ్ ఆయనలో కనిపిస్తుంది. షరీఫ్‌ని పరీక్షించిన డాక్టర్ సమస్య

ఏం పెద్దది కాదు, మైనర్ ప్రాబ్లం అని చెప్పి టెస్ట్‌లు ఏమీ చేయకుండానే మందులు రాసిచ్చారు. హమ్మయ్య అంతా అల్లాహ్ దయ అని ఊపిరి పీల్చుకున్నారు. వారం రోజుల్లో షరీఫ్ గారికి ఛాతీలో నొప్పి తగ్గింది. చేయి లాగడం, ఆయాసం అన్నీ తగ్గాయి.

అయినా డాక్టర్‌గారు ఒక వారం తర్వాత కలవమన్నారు కదా మళ్ళీ డాక్టర్‌ను కలిశారు. ఇప్పుడెలా ఉంది? అడిగారు డాక్టర్. అల్లాహ్ దయవల్ల ఇప్పుడు బాగానే ఉంది సార్ ఎంతో వినయంతో సమాధానం చెప్పారు. అంతే మందులు ఇచ్చింది తనైతే ఈ మనిషి ఇలా అంటున్నా డేమిటి? అని ఒక్కసారి షరీఫ్ వంక అసహనంతో చూశారు డాక్టర్. తన జీవితంలో ఫస్ట్ టైమ్ ఇలాంటి పేషంట్‌ను చూస్తున్నారు ఆయన. డాక్టర్ నా జబ్బు తగ్గింది. అంతా మీ దయ అని చెప్పిన కొన్ని వందల మంది పేషంట్స్‌ను చూశాను. కానీ ఈయన ఒక్కరే అల్లాహ్ దయ వల్ల తగ్గింది అంటున్నా రేమిటి అని ఆయన మీద కొంచెం కోపం కూడా వచ్చింది. షరీఫ్ గారు మళ్ళీ ఛాతీలో నొప్పి, ఆయాసం, ఎడమ చేయి లాగడం అన్నీ తగ్గాయి కానీ ఎందుకో నడుస్తుంటే కొంత ఇబ్బందిగా ఉంది చెప్పారు.

షరీఫ్ గారికి ఏ గుండె జబ్బు లేదు అది కేవలం గ్యాస్ట్రిక్ వల్ల వచ్చిన నొప్పి అని తెలుసు డాక్టర్ సాదిక్‌కు. అయినా ఇతను పదేపదే అల్లాహ్ దయ వల్ల తగ్గింది అంటున్నాడే అన్న సంగతి మింగుడు పడటం లేదు డాక్టర్‌కు. ఎలాగైనా ఆయన నోటి నుంచి మీ దయ వల్ల తగ్గింది డాక్టర్ గారు అని అనిపించుకోవాలన్న కోరిక మొదలైంది డాక్టర్‌లో.

సరే ఇంకా మీ సమస్య పూర్తిగా తగ్గలేదు అంటున్నారు కాబట్టి ఈసారి కొన్ని టెస్ట్‌లు రాస్తాను. ఈసీజీ, ఈసీఓ, బ్లడ్ టెస్ట్ ఇంకా కొన్ని టెస్ట్‌లు రాస్తాను చేయించుకోండి. ఆ తర్వాత చూద్దాం ప్రాబ్లం ఏమిటో అని చెప్పారు.

ఇదేంటి విషయం మళ్ళీ మొదటికొచ్చింది. అంతా తగ్గిందిలే అని అనుకుంటే డాక్టర్ గారు మళ్ళీ ఇన్ని టెస్ట్‌లు రాశారు అని తెల్లబోయారు. అయినా తప్పదుగా అంత పెద్ద డాక్టర్ చెబితే చేయించుకోవాల్సిందేగా అని అనుకున్నారు.

సరే సార్ మీరు చెప్పినట్లే అన్ని టెస్ట్‌లు చేయించుకుంటాను అని బయలుదేరిన షరీఫ్ గారిని చూసి సాదిక్ చిన్నగా నవ్వుకున్నారు. అంతా అల్లాహ్ దయ అన్నావు మరి నేను చెప్పినట్లు వింటున్నావే అని లోలోపలే మురిసిపోసాగారు డాక్టర్.

టెస్ట్‌లు అన్నీ చేయించుకుంటే అన్నీ నార్మల్‌గానే ఉన్నాయి. ఏమీ ప్రాబ్లమ్ లేదు. హమ్మయ్య అని అనుకున్నారు. మళ్ళీ అల్లాహ్ దయ వల్ల తన టెస్ట్‌లు అన్నీ నార్మల్‌గానే ఉన్నాయి. డాక్టర్ సాదిక్ కూడా టెస్ట్‌లు చూసి అన్నీ నార్మల్‌గానే ఉన్నాయి అని చెప్పారు.

డాక్టర్! అల్లాహ్ దయ వల్ల నా రిపోర్ట్స్ అన్నీ నార్మల్‌గానే ఉన్నాయి కదా అడిగారు షరీఫ్ సాబ్. మళ్ళీ ఆ మాట వినగానే డాక్టర్ గారికి ఇరిటేషన్ కలిగింది. చేసేది ఏమీలేక మీకు ఏ ప్రాబ్లమ్ లేదు. అంతా బాగుంది మీకు వచ్చింది గ్యాస్ట్రిక్ నొప్పి అంతే అని చెప్పి ఇక దయచేసి నా దగ్గరకు ఎప్పుడూ రాకండి అని ముఖం సీరియస్‌గా పెట్టి వెళ్ళమన్నారు.

ఆయన ఎందుకు అలా మాట్లాడారో అర్థం కాలేదు షరీఫ్ గారికి. నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదు. బయట ఒక జూనియర్ డాక్టర్ ఉంటే విషయం ఆయనకు చెప్పి సార్ ఎందుకు అలా అన్నారో అడిగారు. డాక్టర్ గారి గురించి బాగా తెలిసిన జూనియర్ డాక్టర్ మీరు చెప్పిన అంతా అల్లాహ్ దయ అనే మాట మా డాక్టర్ గారికి నచ్చలేదు. చూసేది నేను, ట్రీట్‌మెంట్ ఇచ్చేది నేను, మందులు రాసేది నేను అయితే నా దయవల్ల తగ్గింది అని చెప్పకుండా మీరు మాటి మాటికీ అంతా అల్లాహ్ దయ అనడం బహుశా మా సార్‌కు నచ్చలేదు కాబోలు. ఆయన ఫీల్ అయినట్టున్నారు. అసలు సంగతి చెప్పాడు జూనియర్ డాక్టర్.

అంతే. జూనియర్ డాక్టర్ గారి మాటలు విన్న షరీఫ్ గారికి ఒళ్ళు మండిపోయింది. ఎంత గర్వం? ఎంత అహంకారం? అంత పెద్ద డాక్టర్ అయినా ఏం లాభం? ఈయనను సృష్టించి, డాక్టర్ చేసిన ఆ అల్లాహ్ గొప్పదనాన్నే కాదంటారా? కోపం నషాళానికి అంటింది. ఆయన రావద్దనేది ఏంటి? నేనే ఇక నా జీవితంలో ఎంత జబ్బు చేసినా ఎంత ఇబ్బందిగా ఉన్నా ఈయన దగ్గరకు మాత్రం చస్తే రాను అని చెప్పి చకచకా హాస్పిటల్ నుంచి బయటికి వచ్చేశారు.

కొన్ని నెలలు గడిచిపోయాయి. షరీఫ్ గారి గ్యాస్ట్రిక్ సమస్య పూర్తిగా తగ్గిపోయింది. తన పుస్తకాల షాప్‌లో కూర్చుని ఏదో పుస్తకం తిరగేస్తున్నారు. ఇంతలోనే మెరుపు వేగంతో వచ్చిన ఒక కారు డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టుకుంటూ అంతెత్తున

ఎగిరిపడింది. పెద్ద శబ్దం. అంతలోనే గుంపులుగా జనం ఒక్కసారిగా ఏం జరిగిందో ఎవరికీ అర్థం కాలేదు. ఆ తర్వాత షరీఫ్‌గారికి, అక్కడున్న జనానికి అర్థం అయింది కార్ యాక్సి డెంట్ అని. ఆ కారులో ఒక పాతిక సంవత్సరాల కుర్రాడు తలకు బలమైన దెబ్బ తగిలి రక్తం విపరీతంగా పోతుంది. చూస్తుంటే ఎవరో బాగా డబ్బున్న వాళ్ళ అబ్బాయిలా ఉన్నాడు. చాలా వేగంగా కారు నడపడం వల్ల అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఇలా జరిగింది. అందరూ ఆ యాక్సి డెంట్‌ను చూస్తున్నారే కానీ ఎవరూ అంబులెన్స్‌కు ఫోన్ చేయలేదు. ఆ అబ్బాయిని కాపాడాలని ఎవరూ అనుకోవడం లేదు. అందరూ వారి వారి సెల్‌ఫోన్లలో వీడియోలు తీసుకుని సోషల్ మీడియాలో పెట్టుకుంటున్నారే కానీ ఎవరూ సహాయం చేయడంలేదు. అరగంట అలా గడిచిపోయింది. షరీఫ్ సాబ్ ఇక లాభం లేదు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇక తనే ఎలాగైనా ఆ అబ్బాయిని హాస్పిటల్‌లో చేర్చా లని నిర్ణయించుకున్నారు. వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అంబులెన్స్‌లో ఆ అబ్బాయితోపాటు షరీఫ్ గారు కూడా కూర్చున్నారు. హాస్పిటల్‌లో ఆ అబ్బాయిని జాయిన్ చేశారు. తలకు బలమైన గాయం తగిలింది. వెంటనే ఆపరేషన్ చేయాలి అని చెప్పారు డాక్టర్లు. ఆ అబ్బాయి సెల్‌ఫోన్ తీసుకుని వాళ్ళ ఇంటివారికి ఫోన్ చేద్దాం అని అనుకున్నారు. ఆ అబ్బాయి సెల్‌లో అబ్బాజాన్ అని సేవ్ చేసిన నెంబర్‌కు కాల్ చేసి విషయం చెప్పారు. అవతల ఆ అబ్బాయి తండ్రి కంగారుగా ఉన్నారు. వెంటనే బయలుదేరి హాస్పిటల్‌కు చేరుకున్నారు. ఆ అబ్బాయి తండ్రిని చూసిన షరీఫ్‌కు మతిపోయింది. ఆ అబ్బాయి మరి ఎవరో కాదు. ఎంతో ఫేమస్ గుండె డాక్టర్ అయిన సాదిక్ గారి కొడుకు.

సాదిక్ గారు ఎంతో టెన్షన్‌గా ఉన్నారు. డాక్టర్స్‌తో మాట్లాడు తున్నారు. బ్రెయిన్‌లో బ్లడ్ గడ్డ కట్టింది. చాలా క్రిటికల్ కేస్ మేమైతే ఆపరేషన్ చేస్తాం కానీ హోప్స్ అయితే లేవు. ఇక ఆ తర్వాత అంతా పైవాడి దయ అని చెప్పేశారు డాక్టర్లు.

ఒక్కగానొక్క కొడుకు ఇలా అయిపోవడంతో తండ్రి గుండె పగిలిపోయింది. ఏమి చేయాలో అర్థం కాక తలపట్టుకుని కుర్చీలో కూలబడ్డారు. మెల్లగా డాక్టర్ గారి భుజం మీద చేయివేశారు షరీఫ్ సాబ్. సార్ భయపడకండి మీ అబ్బాయికి ఏం కాదు. యాక్సిడెంట్ జరిగింది నా షాప్ ముందే నేనే హాస్పిటల్‌కు తీసుకువచ్చాను. ఏంకాదు సార్ ఆపరేషన్ చేయించండి అల్లాహ్ దయ వల్ల ఆపరేషన్ సక్సెస్ అవుతుంది అని ధైర్యం చెప్పారు.

సాదిక్ గారు షరీఫ్‌గారిని వెంటనే గుర్తుపట్టారు అంత బాధలో కూడా. కళ్ళు తుడుచుకుని కొడుకుని స్ట్రెక్చర్ మీద ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకు వెళుతుంటే అచేతనంగా చూస్తూ ఉండిపోయారు. మొట్టమొదటిసారి చేతులు రెండు పైకెత్తి ఆ అల్లాహ్‌ను ప్రార్థించసాగారు డాక్టర్ సాదిక్. అల్లాహ్ నా బిడ్డను కాపాడు నీవు తప్ప ఎవరూ దిక్కులేరు. ఎంత పెద్ద డాక్టర్లు అయినా, ఎంత గొప్ప హాస్పిటల్స్ అయినా ప్రాణాలు నిలబెట్టేది నీవే. నా బిడ్డను రక్షించు అని ఒక గొప్ప డాక్టర్‌గా కాక ఒక నిస్సహాయ తండ్రిగా అల్లాహ్‌ను ప్రార్థించసాగారు. రెండు గంటల తర్వాత ఆపరేషన్ పూర్తయింది. ఆపరేషన్ చేసిన డాక్టర్లు బయటికి వచ్చి ఆపరేషన్ సక్సెస్ అయింది. మీ అబ్బాయి సేఫ్ అని చెప్పారు. ఆపరేషన్ అయ్యేదాకా షరీఫ్ గారు కూడా అక్కడే ఉన్నారు. ఆ మాట విన్న తర్వాత, షరీఫ్, సాదిక్ ఇద్దరూ చేతులెత్తి అంతా అల్లాహ్ దయ అని చెప్పారు. ✤


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

‘చరితార్థులు’



# మాసుమా బేగం

125

**(1902-1990)**

‘ఆంధ్రప్రదేశ్ తొలి మంత్రివర్గంలో ప్రథమ మహిళా మంత్రి, మొదటి ముస్లిం మంత్రి, మొత్తం భారత దేశంలోనే మంత్రి పదవిని నిర్వహించిన మొట్టమొదటి ముస్లిం మహిళ’ మాసుమా బేగం 1902లో ప్రస్తుత తెలంగాణా రాజధాని హైదరాబాద్‌లో జన్మించారు. తల్లి తయ్యిబా బేగం (Tyaba Begum Bilgrami) మంచి విద్యావంతురాలు. తండ్రి ఖదీఫ్ జంగ్ (Khadif Jung) ఉన్నతాధికారి. హైదరాబాద్‌లోని మహబూబియా బాలికల పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన ఆమె 1922లో సమీప బంధువు హుసైన్ అలీ ఖాన్‌ను వివాహమాడారు. మంచి విద్వత్తు, స్వతంత్ర, ఉదార భావాలు గల వ్యక్తి భర్తగా లభించటంతో సమాజ సేవా కార్యక్రమాలలో మాసుమా ఉత్సాహంగా పాల్గొన్నారు. 1921లో విద్యావ్యాప్తి ప్రధాన లక్ష్యంగా కృషిచేస్తున్న అంజుమన్‌కు అధ్యక్షురాలుగా ఆమె ఎన్నికయ్యారు. విద్యావ్యాప్తి కోసం మాత్రమే కాకుండా సంఘసేవా కార్యక్రమాలు, సామాజిక రుగ్మతల నివారణకు ఆమె నడుంకట్టారు. పలు విద్యా, సాంఘిక సేవా సంస్థల ఏర్పాటుకు కృషి చేయడమే కాకుండా ఆయా సంస్థలలో క్రియాశీలక పాత్ర నిర్వహించారు. ప్రధానంగా మహిళా సంఘాల కార్యక్రమాలకు ఎక్కువ సమయాన్ని కేటాయించిన మాసుమా బేగం వివిధ జాతీయ – అంతర్జాతీయ మహిళా–ప్రజాసంఘాలలో ఉన్నత స్థాయి పదవులను నిర్వహించారు. జాతీయ సేవాభావాలు గల ఆమె భారత జాతీయ కాంగ్రెస్ కార్యక్రమాల పట్ల ఆసక్తి చూపుతూ జాతీయోద్యమంలో భాగంగా ఉనికిలోకి వచ్చిన పలు ప్రజా, మహిళా సేవా సంస్థల ఏర్పాటులో మాత్రమే కాకుండా ఆయా సంస్థల కార్యక్రమాలలో క్రియాశీలక పాత్ర నిర్వహించారు. అటు సమాజ సేవా కార్యక్రమాల ద్వారా, ఇటు రాజకీయ కార్యక్రమాల వైపు మొగ్గు చూపిన కారణంగా ప్రజల, ప్రముఖుల మన్నన పొందారు. 1952లో తొలిసారిగా, ఆ తరువాత 1957లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా మాసుమా బేగం విజయం సాధించారు. ఈ విజయాల ద్వారా ఆమెకు ఎనలేని కీర్తిప్రతిష్ఠలను తెచ్చిపెట్టిన పదవులు లభించాయి. 1957లో Congress Legislative Party Deputy Leader గా ఆమె నియమితులయ్యారు, Member-in-Charge-International Relations గా నియుక్తులయ్యారు. ప్రముఖ కాంగ్రెస్ నాయకులు దామోదరం సంజీవయ్య మంత్రివర్గంలో సాంఘిక సంక్షేమం, ముస్లిం ఎండోమెంట్స్‌శాఖ మంత్రి పదవి మాసుమా బేగంకు లభించింది. 1960 నుండి 1962 వరకు పదవీ బాధ్యతలను ఆమె సమర్థవంతంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ తొలి మంత్రివర్గంలో ప్రథమ మహిళా మంత్రిగా, మొట్టమొదటి ముస్లిం మంత్రిగా, మొత్తం భారతదేశంలోనే మంత్రిపదవిని నిర్వహించిన మొదటి ముస్లిం మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. 1962 ఎన్నికల్లో ఆమె ఓటమిని చవిచూశారు. ఆ పరాజయం తరువాత ఆమె పూర్తిగా సేవాకార్యక్రమాలకు పరిమితం అయ్యారు. 1974లో భారత ప్రభుత్వం ‘పద్మశ్రీ’ అవార్డుతో ఆమెను సత్కరించి గౌరవించింది. చివరి వరకు ప్రజల, ప్రధానంగా మహిళల సేవా కార్యక్రమాలలో నిమగ్నమైన మాసుమా బేగం 1990లో కన్నుమూశారు. ✤



✆ 9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్ర కారుడు, బహుగ్రంథ కర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ ‘చరితార్థులు’ (తెలుగు) ‘ది ఇమ్మోర్టల్స్’ (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

# గుండెల నిండా దైవభీతి నింపుకున్నారు

నసీరా బేగం

**దైవభీతి** అనేది మనిషి చేసే అన్ని పుణ్యకార్యాలకు మూలాధారం. దీనిద్వారా మనిషి హృదయంలో మంచి పనులు చేసే, చెడు నుంచి తనను తాను తప్పుకునే కాంక్ష జనిస్తుంది. ఇంకా ఈ విషయంలో దినదినాభివృద్ధి చెందుతూ దైవ సంతోషాన్ని కైవసం చేసుకునే శక్తి లభిస్తుంది. ఈ విషయానికి సంబంధించిన రుచిని రమజాన్ మాసంలో దైవదాసులందరూ చూశారు. ఎవరి హృదయంలోనైతే దైవ భయం, పరలోకంలో సమాధానం చెప్పుకోవలసి ఉందనే భావన ఉండదో వారికి నమాజ్, ఉపవాసం లాంటి విధి ఆరాధనలు కూడా ఆచరించటం మహా కష్టమైపోతుంది. కాని దైవభీతి కలవారికి విధి ఆరాధనలే కాదు అదనపు ఆరాధనలను ఆచరించటం కూడా అతి తేలికైపోతుంది. ఒక చిన్న పొరపాటు జరిగినా మహా అపరాధం జరిగినట్లు వారి హృదయం భయంతో కంపించిపోతుంది. కనుకనే మహనీయులు దానిని ఇలా విశ్లేషించారు: నిజమైన ఒక విశ్వాసి ద్వారా ఒక చిన్న పాపం జరిగినా అతను తన శిరస్సుపై ఒక పెద్ద బండరాయి వచ్చి పడ్డట్లు భావిస్తాడు. అదేగనక ఒక అవిశ్వాసి ద్వారా మహా పాపకార్యం జరిగిపోతే అతను తనపై ఒక ఈగ వచ్చి వాలి వెళ్ళిపోయినట్లు అంటే అతను దానిని అతి తేలికగా భావిస్తాడు. దాని కారణంగానే ఈనాటి మన సమాజంలో అన్యాయాలు, అక్రమాలు, దౌర్జన్యాలు సర్వసాధారణమైపోతున్నాయి. దైవప్రవక్త(స), 'ఓ అల్లాహ్! నాకూ, నా పాపాలకూ మధ్య అడ్డుపడే భయభక్తులను నాకు ప్రసాదించు' అని అల్లాహ్‌ను ప్రార్థిస్తూ ఉండమని సెలవిచ్చారు.

దైవప్రవక్త(స)గారి అనుచరులకు ఆయన(స) గారి సాంగత్యం లభించింది. పటిష్టమైన విశ్వాసం వారి నరనరాల్లో జీర్ణించుకుపోయి ఉండేది. ధర్మం కోసం కృషి చెయ్యటం, త్యాగాలివ్వటమే వారి కర్తవ్యంగా ఉండేది. వారిలో ఉన్న ఈ గుణ విశేషాలను మెచ్చుకున్న అల్లాహ్ కొంత మందికి పరలోకంలో స్వర్గం తప్పకుండా లభిస్తుందనే విషయం నిర్ణయమైపోయిందనే శుభవార్తను కూడా ఇచ్చివేశాడు. ఈ గొప్ప శుభవార్తను పొందిన తరువాత కూడా వారి హృదయంలో

దైవభయం రవ్వంత కూడా తగ్గలేదు. పైగా అది మరింత పెరిగిపోయింది.

వాటికి సంబంధించిన ఎన్నో సంఘటనలు మనకు చరిత్రలో కనిపిస్తాయి.

ఉదాహరణకు, హజ్రత్ ఉమర్(ర) ఎంతో ధైర్యవంతులు. భయపడటం అనేది ఆయన గారి నైజంలోనే ఉండేది కాదు. కాని దైవభయం ఆయన గారి నరనరాల్లో జీర్ణించుకుపోయి ఉండేది. సమాధి శిక్ష గురించి పరలోకంలో జవాబుదారీతనం గురించి ఆలోచించి విపరీతంగా విలపించేవారు. ఒకసారి ఆయన(ర) త్రాగటానికి మంచి నీళ్ళు అడిగారు. ఆయన అమీరుల్ మోమినీన్ కాబట్టి ఆయనకు మంచి నీళ్ళకు బదులు ఒక తియ్యని పానీయం ఇవ్వబడింది. ఆయన అది త్రాగుతూ ఉండగా ఆయనగారి కళ్ళల్లో నుంచి ధారాపాతంగా కన్నీళ్లు ప్రవహించసాగాయి. అది చూసిన అక్కడి ప్రజలు 'ఓ అమీరుల్ మోమినీన్! విలపిస్తున్నారేమిటి' అని అడిగారు. దానికి ఆయన(ర) 'మీ సత్కార్యాల ప్రతిఫలపు రుచిని మీరు ఇహలోకంలోనే ఆస్వాదించారు. మీ ప్రతిఫలం మీకు పూర్తిగా లభించింది అని పరలోకంలో నాకు ఎక్కడ చెప్పబడు తుందో, అక్కడ నేను సత్కార్యాలేమీ లేనివాడినై పోతానేమో అనే భయం నాకు కలుగుతోంది' అని సమాధాన మిచ్చారు.

హజ్రత్ ఉమర్(ర) ఒక పెద్ద రాజ్యానికి అధిపతి అయి ఉండి కూడా ఆయన సర్వసాధారణమైన, అతి చవకైన బట్టలు ధరించేవారు. అవసరమైతే దానికి అతుకులైనా కుట్టించి ధరించేవారు. ఈ విషయంలో ఆయన ఇలా అనే వారు: నేను ఒకవేళ ఖరీదైన వస్త్రాలు ధరించినట్లయితే ఒక మామూలు వ్యక్తికి నా వస్త్రాలను చూసినప్పుడు బాధ కలిగితే, లేదా అతనికి కూడా అలాంటి వస్త్రాలు ధరించే కోరిక కలిగితే నేను అతని హక్కును హరించే వాడినైపోతాను. అతన్ని బాధకు గురిచేసినవాడినైపోతాను. అతను ప్రళయ దినంనాడు అల్లాహ్ సమక్షంలో దాని వివరణను కోరితే నేను ఏమని సమాధానం చెప్పగలను?

హజ్రత్ అలీ(ర) ఇలా సెలవిచ్చారు : హజ్రత్ ఉమర్(ర)ను ఆయన గారు పదవీ కాలంలో ఉన్నప్పుడు కాబా గృహం చుట్టూ ప్రదక్షిణం చేస్తూ ఉండగా నేను చూశాను. ఆయన గారు ధరించిన వస్త్రాలపై ఇరవై ఒక్క అతుకులు వేయబడి ఉన్నాయి. కొన్ని అతుకులు బట్టలవి కూడా కావు.

హజ్రత్ ఉస్మాన్(ర) గారు దానగుణం కలవారు. అల్లాహ్ ఆయన గారికి ఎనలేని సంపదను ప్రసాదించాడు. కాని ఆయనగారు దాదాపుగా తన పూర్తి ధనాన్ని అల్లాహ్ మార్గంలో ఖర్చు చేసేవారు. దాని కారణంగా ఆయనకు 'గనీ' అనే బిరుదు కూడా లభించింది. అయినప్పటికీ ఆయన గారు దైవభయంతో గజగజా వణికిపోతూ ఉండేవారు. ఎప్పుడైనా సమాధుల మార్గం నుంచి వెళుతున్నప్పుడు సమాధి శిక్షను గురించి ఆలోచించి విపరీతంగా విలపించేవారు. దానితో ఆయన గారి గడ్డం తడిసి ముద్దయిపోయేది.

హజ్రత్ ఆయిషా(ర) దైవప్రవక్త(స) గారి ప్రియ భార్య అయి నప్పటికీ, ఆయన(స) గారికి ఎంతో సేవ చేసినప్పటికీ ఆయన(స) గారు పరమపదించిన తరువాత కూడా ధర్మ ప్రచారంలో, ధార్మిక విషయాలలో చురుకుగా పాలుపంచు కున్నప్పటికీ, ఎంతో మందికి ధార్మిక విద్య గరిపినప్పటికీ, ఎన్నో హదీసులను ఉల్లేఖించినప్పటికీ ఆమె దైవభీతితో వణికిపోయేవారు. దైవభయం కారణంగా ఆమె గారు ఎన్నో నిదుర లేని రాత్రులను కూడా గడిపేవారు. ఆమె గారి ద్వారా ఎవరికైనా ఏదైనా రవ్వంత కూడా కష్టం కలిగితే వెంటనే ఆమె గారు క్షమాపణ కోరేవారు.

దైవప్రవక్త(స) గారి ప్రత్యక్ష అనుచరుల తరువాత కూడా ఆయన(స) గారిని అనుసరించిన ప్రత్యేక గుణాలను పొందిన మహానుభావులు కూడా ఎందరో మనకు చరిత్రలో లభిస్తారు. ప్రఖ్యాతిగాంచిన ఇమామ్ అబూ హనీఫా(ర) గారు ఇస్లామ్ ధర్మప్రచారంలో అవిరళ కృషి జరిపారు. అలాంటి మహా వ్యక్తి గుండె కూడా దైవభీతితో దడదడలాడేది. చిన్న పొర పాటుకే ఆందోళన చెందేది. ఆయన గారికి సంబంధించిన ఒక సంఘటనను ఇమామ్ రాజి(ర) గారు ఇలా విశ్లేషించారు. ఒకసారి ఇమామ్ అబూ హనీఫా నడుస్తూ పోతూ ఉన్నారు. దారిలో ఒకచోట బురద పేరుకుపోయి ఉంది. అకస్మాత్తుగా ఆయన గారి కాలుకు ఏదో రాయి తగిలి ఆయన గారి చెప్పు ధబాలున బురదలో పడింది. ఆ వేగానికి ఆ బురద కాస్తా ఎగిరి ఒక ఇంటి గోడపై పడింది. అది చూసి ఆయన ఆందోళన పడ్డారు. ఆ బురదను శుభ్రం చేస్తే గోడ మట్టి కాస్తా పడిపోయినట్లుంది. వదలివేస్తే గోడకు బురద అలాగే ఉండిపోతుంది. రేపు ప్రళయ దినం నాడు అల్లాహ్ దీని గురించి ప్రశ్నిస్తే ఏమి సమాధానం ఇవ్వగలను? అని

**(మిగతా 15వ పేజీలో)**

## కవి కరీముల్లా సామాజిక విశ్లేషణ

# ఇస్లాంలో కులవ్యవస్థకు తావే లేదు...

**సత్యం చెప్పులు** తొడుక్కునే లోపు అసత్యం భూప్రదక్షిణం చేసి వస్తుందనేది నానుడి. షేకులు, సయ్యదులు, పఠాన్లు, మొఘలులు ఇంకా ఇతర చేతి వృత్తులతో పిలవబడేవారు కులాలుగా పిలవబడరు. అసలు కులవ్యవస్థ స్వభావం ఏ విధంగా ఉంటుందో తెల్సినవారు ముస్లింలలో కులాలున్నా యని మాట్లాడరు. ముస్లింలలో సయ్యదులు అగ్రకులమని కొంతమంది మాట్లాడుతున్నారు. సయ్యద్ అనేది కులం కాదు, కనీసం వంశం కూడా కాదు. అరబ్బు దేశాలలో షేకుల్ని సయ్యదులు అని పిలుస్తారు. సయ్యద్ అంటే నాయకుడు అని అర్థం. అంతే తప్ప కులం కాదు. ఇస్లాంలో కులవ్యవస్థ లేదు కనుకనే అందరి మధ్య వైవాహిక సంబంధాలు ఉన్నాయి. మస్జిదులో ఇమామ్ సయ్యదులే ఉండరు. ఎవరైనా ఉంటారు. మీకు దగ్గరగా ఉన్న ఏ ఊరి మస్జిదుకైనా వెళ్లండి. ఇమామ్ ఎవరో ఆరా తీయండి. ఏ తెగకు చెందిన వారైనా ఉంటారు. సరియైన ఇస్లామీయ అవగాహన, ఆచరణ లేకపోవడం వల్ల ముస్లింలలో కొన్ని అంతరాలు, మూఢనమ్మ కాలు ఉన్నాయి. ఈ అంతరాలు, మూఢనమ్మ కాలు దూరం చేసే శక్తి ఒక్క ఇస్లాంకు మాత్రమే ఉంది.

ఒక జాతివానికి చెందిన ఒంటె మరొక జాతివానికి చెందిన పొలంలో మేత మేస్తే రెండు జాతులు కొట్లాడుకుని వేల మంది చనిపోయిన అజ్ఞానం, దురహంకారం ఆనాటి అరేబియాలో ఉంది. దైవప్రవక్త ముహమ్మద్(స) జన్మించి అలాంటి సమాధానం పడటానికి అవకాశం లేని జాతుల్ని, తెగల్ని సైతం సమాధానపర్చి లాయిలాహ యిల్లల్లాహ్ (దైవం ఒక్కడే) అనే ఏకేశ్వరత్వం అనే మార్గంలో ఏకం చేయగలి గారు. వంశాల ఘనతల్ని ఆయన రద్దు చేశారు. పుట్టుక రీత్యా మీలో ఎవ్వరూ అధికులు కాదు, అల్పులు కాదని స్పష్టం చేశారు. తెల్లవానికి నల్లవానిపై, నల్లవానికి తెల్లవానిపై, అరబ్బులకు అరబ్బేతరులపై, అరబ్బేతరులకు అరబ్బులకు



ఎలాంటి ఆధిక్యత లేదని ప్రకటించారు. అప్పటివరకూ తమ వద్ద బానిసలుగా ఉన్న నీగ్రోలకు ప్రవక్త ఆదేశంతో అరబ్బులు తమ కుమార్తెలను ఇచ్చి వివాహం చేసిన సందర్భాలున్నాయి. ధనిక, పేద, వంశాలు, తెగల తారతమ్యం లేకుండా అందరూ మస్జిద్లో రోజుకు ఐదుసార్లు అల్లాహు అక్బర్ అంటూ నమాజ్ చదవటం గొప్ప ప్రజాస్వామిక ఆచరణ అని సరోజిని నాయుడు అన్నారు. వ్యవహారం మీ బంధువులదైనా సరే మీరు న్యాయం వైపు నిలబడండి అని ప్రవక్త బోధించారు. నాగరాజు అనే దళిత యువకుడ్ని చంపటం ముమ్మాటికీ నేరమే. మత దురహంకారంతో జరిగిన ఆ నేరాన్ని మాన వత్వం ఉన్న వారెవరైనా ఖండించాలి. ఒక వ్యక్తి తప్పు చేస్తే మొత్తం సమాజంపై నిందలేయటం ఎంత వరకు సబబో ఆలోచించాలి. స్వీయ సమాజాన్ని బోనులో నిలబెట్టే అవ గాహనా రాహిత్య రాతల వల్ల ముస్లిం సమాజానికి ఎనలేని కీడు జరుగుతుంది. ఓ వైపు నిత్యం అభద్రతతో బతుకుతూ, ఫాసిస్టు బుల్డోజర్లతో వేగుతున్న ప్రజలకు సంఘీభావంగా నిలబడాల్సింది పోయి ఎవడో ఒకడు నేరం చేస్తే దాన్ని

మొత్తం సమాజంపై వేసి దోషులుగా బోనులో నిలబెట్టాలని చూడటం కుతర్కం. అన్యాయంగా ఏ వ్యక్తి ఏ వ్యక్తిని హత్య చేసినా సమస్త మానవ జాతిని హత్య చేసినట్లేనని పవిత్ర ఖుర్‌ఆన్ చెప్తుంది. దళితులు ముస్లింలు ఈ దేశంలో నిత్యం పీడనకు గురౌతున్న అణగారిన వర్గాలు. వీరి మధ్య విభేదాలు పెంచేందుకు కొన్ని మతతత్వ శక్తులు కృషి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అందరం సమిష్టిగా నేరాన్ని నేరంగా ఖండించి సమైక్యంగా మాట్లాడాలి. మానవులంతా పరస్పరం సోదరులేనని ఇస్లాం చెప్తుంది. కనుక కుల మత, వర్గ, భాషా తారతమ్యాలు లేకుండా తోటి మానవులందరినీ ప్రేమించాలి. మతం పేరుతో ఉన్మాదాన్ని వ్యతిరేకించాలి. భూమిపై, దాని సహజ సంపదపై కుల, మత ప్రాంతాలకు అతీతంగా సర్వ మానవాళికి హక్కుంది. అందరూ సమంగా పంచుకుంటూ, సమంగా అనుభవిస్తూ మానవత్వం ఉన్న మనుషులుగా బతకమని ఇస్లాం చెప్తుంది. ప్రజల సంపదను కొల్లగొట్టి నియంతలుగా, రాజులుగా చెలామణీ అవుతూ పీడించే పాలనల్ని ప్రవక్తలు తిరస్కరించారు. నాటి సమకాలీన పీడిత ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారు. సమాజానికి సఫలవంతమైన జీవన విధానాన్ని చూపించి ఆ దైవానికి తప్ప ఈ భూమిపై ఏశక్తికి సాగిలపడవద్దని బోధించారు. ఆ సఫలవంతమైన జీవన విధానమే ఇస్లాం. అలనాటి ఆ పీడిత వర్గ ప్రజలనే అరబీ భాషలో ముస్లింలని అన్నారు. ముస్లిం అంటే దైవ విధేయుడని అర్థం. ఆ దైవానికి తప్ప ప్రపంచంలోని ఏ శక్తికి సాగిలపడని దృఢచిత్తం కలవాడని అంతరార్థం. కుల మత అంతరాలతో వివక్ష చూపేవాడు, ఇతరులను ద్వేషించేవాడు ముస్లిం కాడు. దురభిమానం కారణంగా ఇతరులను ద్వేషించేవాడు ముస్లిం అనే భావానికి సరిపోడు. ✤






## గుండెల నిండా దైవభీతి... (13వ పేజీ తరువాయి)

చెమర్చిన కళ్ళతో ఆలోచిస్తూ నిల్చుని ఉన్నారు. అంతలో ఆ ఇంటి యజమాని బయటికి వచ్చాడు. అతను యూదుడు. యాదృచ్ఛికంగా అతను ఇమామ్ గారి వద్ద అప్పు తీసుకున్నవాడు. ఇమామ్ గారిని చూసి అప్పుకు సంబంధించిన డబ్బులు అడగటానికి వచ్చారేమోనని భావించి రెండు చేతులు జోడించి ఇంకా కొంత వ్యవధి ఇవ్వమని ప్రాధేయపడసాగాడు. అప్పుడు ఇమామ్ గారు నేను నీ వద్దకు అప్పు అడగటానికి ఎంత మాత్రమూ రాలేదు. నా కారణంగా నీ గోడపై బురద పడింది. దానిని అలాగే వదలి వెళ్ళిపోతే నేను దోషినైపోతాను. ఒకవేళ శుభ్రం చేసినట్లయితే నీ గోడ కాస్తా పాడైపోతుంది. కనుక ఈ విషయంపై ఆందోళన చెందుతూ, ఆలోచిస్తూ నిలుచుని ఉన్నాను. దయచేసి నన్ను క్షమించు అని కోరారు. ఆయన గారి ఈ ప్రవర్తన ఆ యూదునికి ఎంతో ప్రభావితం చేసింది. ఆయన గారి దైవభయం, ఆయన గారి మంచి ప్రవర్తనను చూసి ఆయన గారి ధర్మాన్ని అతను స్వీకరించాడు.

అబూ యాఖూబ్ అనే ఒక యువకుడు అక్కడి రాజు గారి దానిమ్మ తోటకు కాపలాదారునిగా ఉండేవారు. ఒకసారి ఆ రాజు షికారుకు బయలుదేరి ఆ తోట వద్దకు చేరుకున్నాడు. అబూ యాఖూబ్‌ను అందులోని దానిమ్మ పళ్ళను కోసి తీసుకుని రమ్మన్నాడు. ఆయన పళ్ళను తీసుకొచ్చి రాజుగారి ముందు పెట్టారు. రాజు దానిమ్మ గింజలను తింటే అవి పుల్లగా ఉన్నాయి. వేరే చెట్టు పళ్ళను తీసుకుని రమ్మన్నాడు రాజు. అవి తీసుకొచ్చి ఇస్తే అవి కూడా పుల్లగానే ఉన్నాయి. రాజు గారికి విపరీతమైన కోపం వచ్చింది. ఏమిటి నీవు ఈ తోటలో ఐదు సంవత్సరాల నుండి పనిచేస్తున్నావు. ఏ చెట్టు పండ్లు తియ్యగా ఉంటాయో, ఏ చెట్టు పండ్లు పుల్లగా ఉంటాయో కూడా నీవు తెలుసుకోలేకపోయావా? అని కోపగించుకున్నాడు. దానికి అబూ యాఖూబ్ ఓ మహారాజా! నన్ను మీరు తోటకు కాపలాదారునిగా మాత్రమే నియమించారు కాని వాటిని రుచి చూడటానికి కాదు కదా! ఇందులోని ప్రతి కాయ అమానతుగా భావించి, దైవానికి భయపడుతూ కాపలా కాశాను అని అన్నారు. ఆయన గారి ఈ సమాధానానికి రాజు ఎంతో ప్రభావితుడయ్యాడు. అంతేకాదు ఆయన్ని తన ప్రత్యేక మంత్రిగా నియమించుకున్నాడు కూడా.

✤ ✤ ✤

# సామాజిక సేవ చేద్దాం!

– సయ్యద్ అబ్దుస్సలామ్ ఉమరీ

**సేవ** అనేక రకాలుగా చేయవచ్చు. ధన పరమైన సహాయం అదించడం, అప్పు ఇవ్వడం, అప్పు తీర్చే స్థితిలో ఆ వ్యక్తి లేకపోతే గడువు ఇవ్వడం, ఒక వస్తువును శాశ్వతంగా ఇచ్చివేయడం లేదా తాత్కాలికంగానైనా ఇవ్వడం, అవసరం వచ్చినప్పుడు ఒకేలాంటి రెండు వస్తువులు – సేద్యం కోసం రెండు ఎద్దులు, పాలు కోసం రెండు ఆవులు ఇవ్వడం, ఒకరితో కూలి కోసం పని చేయించుకోవడానికి బదులు బిజినెస్ పాట్నర్‌గా పెట్టుకోవడం, పొలంలో, పంటలో భాగస్వామ్యం కల్పించటం, బాధిత ప్రజలను ఆర్థికంగా, నైతికంగా, రాజకీయంగానూ ఆదుకోవడం మొదలైనవి ప్రవక్త (స) వారి హదీసుల ద్వారా రూఢీ అవుతాయి.

విశ్వాసం సరైనదయి ఉండి, ఆరాధనల ద్వారా దైవంతో తన సంబంధాన్ని బలపర్చుకుంటే ఆటోమెటిక్‌గా అతని ఆలోచన, ఆచరణ దిశ సయితం సవ్యమైన దిశలో పయనిస్తుంది. రుజుమార్గానికి నిలువుటద్దం అవుతుంది. విశ్వాసాలు, ఆరాధనల తర్వాత ఇస్లాం నైతికత, శాసనాలకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చింది. అది ఉన్నత నైతిక విలువలను బోధించింది. అది మనిషి కీర్తిప్రతిష్టల్ని, గౌరవమర్యాదల్ని ఉన్నత నైతిక ప్రమాణాలతో, ప్రవర్తనతో జోడిస్తుంది. అనైతికత, అశ్లీలత, అసభ్య ప్రవర్తన నుండి దూరంగా మసలుకోవాలని తాకీదు చేస్తుంది. యదార్థమేమిటంటే, నైతిక పతనావస్థ అన్నది మనిషిని అటు ప్రభువు ప్రసన్నతకు, ఇటు ప్రజల ప్రేమకు దూరం చేస్తుంది. ఉత్తమ నైతిక ప్రమాణాల్ని పాటించడం ఒక్కటే మార్గం. అది వినా మార్గాంతరం లేదు. ఉన్నత నైతిక విలువల్లోని స్పష్టమైన కోణం సృష్టిరాసుల సేవ అన్నది. సృష్టిరాసుల సేవ అంటే, ముఖ్యంగా ప్రజల కష్టదుఃఖాల్లో, క్లిష్టతర ఘడియల్లో పాలుపంచుకోవడం. సేవా భావం సాటి ప్రజల యోగక్షేమాల్ని తెలుసుకునేలా మనిషిని ప్రేరేపిస్తుంది. తద్వారా అతనికి శాంతి, మనః సంతృప్తి ప్రాప్తమవుతుంది.

ఇస్లాం ప్రారంభం నుంచే దౌర్జన్యం, దుర్మార్గం, దాష్టీకానికి, దమన నీతికి, పశు ప్రవృత్తికి వ్యతిరేకంగా గళం విప్పింది. బలహీన ప్రజల, బడుగు వర్గాల, దళిత జనాల పక్షం వహించి ఎవరి హక్కులు వారికి అందే వాతావరణాన్ని కల్పించింది. ఎక్కడానూ, ఎప్పుడూను వారి హక్కులు స్వాహా కాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంది. సర్వకాల సర్వావస్థల్లోను వారి హక్కులు వారికి అందేలా కట్టుదిట్టమైన చర్యలు, చట్టాలు ప్రవేశ పెట్టి, అందరూ ఆ శాసనానికి లోబడి ఉండేలా ప్రజల్ని తీర్చిదిద్దింది.

నేడు మానవ సేవ అనగానే క్రిస్టియన్ మిషనరీల భావం మెదడులో కదలాడు తుంది. నిజంగా ఇస్లాం ఈ విషయమై ఎంతో మహోన్నత సేవా భావాన్ని ప్రతిపాదించింది. అది వ్యక్తిని, సమాజాన్ని, రాజ్యాన్ని ఇందులో భాగస్వాముల్ని చేసింది. మానవ సేవా విషయమై అది ఎంత విస్తృతంగా చర్చించిందో, ఎలాంటి ప్రణాళికలను, శాసనాలను ప్రవేశపెట్టిందో అవి అద్వితీయమైనవి, అమోఘమైనవీను అనడంలో ఎలాంటి సంశయం లేదు. ఇస్లాం బోధించే విలువల వెలుగులో మానవ సేవా దృక్కోణాలు ఏమైతే ముందుకు వస్తాయో అవి–

ప్రతి యుగంలోనూ దైవప్రవక్తలు, దైవ గ్రంథాలు సృష్టి సేవ గురించి ఆదేశించారు. ఈ విషయమై చిట్టచివరి దైవ గ్రంథం

ఖుర్ఆన్, చివరి దైవప్రవక్త ముహమ్మద్ (స) ప్రత్యేకంగా నొక్కి వక్కాణించారు. సమాజంలో సేవా భావాన్ని పెంపొందించడమే కాక, దాన్ని దైవ సామీప్యాన్ని పొందే అతి పెద్ద సాధనంగా అభివర్ణించారు.

ఇస్లాం సృష్టిరాసుల సేవను ఆరాధనగా పరిగణిస్తుంది. పవిత్ర ఖుర్ఆన్, నమాజు, జకాత్‌ను ఒకేచోట పేర్కొంటుంది. నమాజు ద్వారా మనిషి సంబంధం మాధవునితో డైరెక్ట్‌గా ఏర్పడుతుంది. జకాతు ద్వారా మనిషి బాంధవ్యం తోటి మనుషులతో బలపడు తుంది. ఆ విధంగా ఈ ఉభయ కోణాలూ ప్రధానమైనవే. మరో కోణం ఏమంటే, ధన పరమైన ఆరాధన దేహ పరమైన ఆరాధనకు బదులుగా ఖరారు చేయడం జరిగింది. కొన్ని సందర్భాలలో ఉపవాసానికి బదులు దానధర్మాలు చేయ మంటుంది ఇస్లాం.

ఇస్లాం కేవలం తనతో మతపరమైన సంబంధం గలవారి సేవ మాత్రమే చేయమని చెప్పదు. అది సమస్త జీవరాసుల పట్ల సత్సంబంధం, సేవాభావం కలిగి ఉండమని ఆజ్ఞాపిస్తుంది.

ఇస్లాం ప్రజల్లో సేవా భావాన్ని ప్రేరేపించడంతో సరిపెట్టుకోదు. వారి సేవకు అర్హులు ఎవరు? వారిలో ప్రథములు ఎవరో కూడా తెలియజేస్తుంది. వారిలో తల్లిదండ్రులు, బంధుమిత్రులు లాంటి రక్త సంబంధీకులు కూడా ఉన్నారు. ఎలాంటి రక్త సంబంధం లేని అనాథలు, అగత్యపరులు, వికలాంగులు, వితంత వులు, ఇరుగు పొరుగువారు, బాటసా రులు, బానిసలు, ఖైదీలు, అవసరార్థులు కూడా ఉన్నారు.

మనిషి అవసరాలు డబ్బుతోనే ముడిపడి ఉంటాయన్నది వాస్తవం. కాబట్టి ధన సేవ ప్రాముఖ్యతను నిరాకరించలేము. అయితే సేవ చేయడానికి ఇదొక్కటే మార్గం అనుకోవడం సరికాదు. పవక్త (స) వారి ప్రవచనాల దృష్ట్యా– తన సోదరునితో నగుమోము సంభాషణ, సవారీపై కూర్చోవడంలో సహాయం చేయడం, ఏదైనా సామాను ఉంటే ఎత్తి ఇవ్వడం, దారి నుండి హానికర వస్తువును తొలగించడం, దారి తెలియని వ్యక్తికి దారి చూపడం, ఒకరికి గిన్నెలో నీరు నింపి ఇవ్వడం, మంచిని ఆదేశించడం, చెడును వారించడం మొదలైనవన్నీ దానధర్మాల క్రిందికే, సేవ క్రిందికే వస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, 'ప్రతి మంచి కార్యం పుణ్యాన్నిస్తుంది, దానధర్మంగానే పరగ ణించబడుతుంది.

తాత్కాలికమైన, తక్షణమైన సేవ ఉంటుంది. ఉదాహరణకు– ఆకలిగొన్న వారికి అన్నదానం చేయడం, దప్పిక గొంతుల దాహాన్ని తీర్చడం, కూడు లేని వారికి కూడు, గూడు లేని వారికి గూడు, గుడ్డలేని వారికి గుడ్డ సమకూర్చి ఇవ్వడం, రోగుల్ని వెళ్ళి పరామర్శించడం, వారికి అవసరమైన వైద్య సదుపాయాల్ని కలుగజేయడం మొదలైనవి. కొన్ని సందర్భాల్లో నయితే ఈ తక్షణ సేవ ప్రాముఖ్యం మరింత అధికమై పోతుంది. అలాంటి విపత్కర సమయంలో నిర్లక్ష్యం, సామాజిక స్పృహ లేమి అన్నది ఆ వ్యక్తిలోని నైతిక పతనావస్థకు తార్కాణం. ఇలాంటి సమయాల్లో ప్రతి ఒక్కరూ స్పందించి తమవంతుగా సేవ అందించాలని ఇస్లాం వక్కాణిస్తుంది.

సేవ అనేక రకాలుగా చేయవచ్చు. ధనపరమైన సహాయం అందించడం, అప్పు ఇవ్వడం, అప్పు తీర్చే స్థితిలో ఆ వ్యక్తి లేకపోతే గడువు ఇవ్వడం, ఒక వస్తువును శాశ్వతంగా ఇచ్చివేయడం లేదా తాత్కాలికంగానైనా ఇవ్వడం, అవసరం వచ్చినప్పుడు ఒకేలాంటి రెండు వస్తువులు– సేద్యం కోసం రెండు ఎద్దులు, పాలు కోసం రెండు ఆవులు ఇవ్వడం, ఒకరితో కూలి కోసం పని చేయించుకోవడానికి బదులు బిజినెస్ పాట్నర్‌గా పెట్టుకోవడం, పొలంలో, పంటలో భాగస్వామ్యం కల్పిం చటం, బాధిత ప్రజలను ఆర్థికంగా, నైతికంగా, రాజకీయంగానూ ఆదుకోవడం మొదలైనవి ప్రవక్త (స) వారి హదీసుల ద్వారా రూఢీ అవుతాయి.

పర్యావరణ పరిరక్షణ సేవ సయితం ఎంతో విస్తృతమైనదిగా చెప్పొచ్చు. ఇలాంటి సేవా కార్యక్రమాల వల్ల సమాజానికి చాలా పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ఇటువంటి సేవలు అటు ప్రభుత్వం, ప్రజలు, సంస్థలు– అందరూ చేస్తుంటారు. ఉదాహరణకు– శుచీశుభ్రత, రహదారుల నిర్మాణం, బస్సు సౌకర్యం, విద్యుత్, నీటి సౌకర్యం, చెట్లు, మొక్కలు నాటడం, అడవులను రక్షించడం, బంజరు భూములను సాగుకు అనుకూలంగా తయారు చేయడం, పాఠశాలలను, ప్రార్థనాలయాలను, అనాథాశ్రమాలను, వైద్యశాలలను నిర్మించడం మొదలైనవి. ఇస్లాం ఇటువంటి సామాజిక కార్యాల వైపు దృష్టి మళ్ళించడమే కాక, వాటి కోసం కొంత ధనాన్ని ప్రత్యేకించాలని ప్రేరేపిస్తుంది. అందు నిమిత్తం అవసరమైన కార్యప్రణా ళికను ప్రజలకు ఇస్తుంది.

ఏ సత్కార్యమైతే దైవప్రసన్నత, చిత్తశుద్ధి ప్రాతిపదికన చేయబడుతుందో, ఆ సత్కార్యం మాత్రమే ఆమోదముద్రను పొందుతుంది. మరే కార్యం వెనకాల పేరు ప్రతిష్ఠల కాంక్ష ఉంటుందో, పచ్చి స్వార్థం దాగి ఉంటుందో అట్టి కార్యాన్ని అది ఎంత ఘనతరమైనదైనా అల్లాహ్ దర్బారులో ఆమోదం పొందజాలదు. పైగా అది శిక్షకు కారణం అవుతుంది. సృష్టి రాసుల సేవ ఎంత ముఖ్యమో, చిత్తశుద్ధి, నిస్వార్థం, దైవ ప్రసన్నత కూడా అంతే ముఖ్యం. చిత్తశుద్ధి లేని ఎట్టి కర్మ ద్వారా నైనా పుణ్యం, మోక్షాన్ని ఆశించలేము. ✤

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది    ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

85 ఆయత్‌లు

# 40. అల్ మూ'మిన్

మక్కా అవతరణ

27 మూసా చెప్పాడు, "నేనయితే లెక్క అడిగే దినాన్ని నమ్మని ప్రతి దురహంకారికి ఎదురుగా నా ప్రభువూ మీ ప్రభువు అయినవాని శరణు పొందాను."[44]

28 – 29 ... ఆ సందర్భంలో ఫిర్‌ఔన్ ప్రజల్లోని ఒక విశ్వాసి, తన విశ్వాసాన్ని మరుగుపరచి ఉంచుకున్న వ్యక్తి, ఎలుగెత్తి పలికాడు: "మీరు ఒక వ్యక్తిని, అతను నా ప్రభువు అల్లాహ్ మాత్రమే అని అన్నంత మాత్రాన చంపివేస్తారా? నిజానికి అతను మీ ప్రభువు వద్ద నుంచి ప్రకాశమానమయిన వాటిని[45] మీ వద్దకు తీసుకువచ్చాడు; ఒకవేళ అతను అబద్ధం పలుకుతున్నట్లయితే అతని అబద్ధం స్వయంగా అతనిపైనే తిరగబడుతుంది.[46] కాని ఒకవేళ అతను నిజం పలుకుతున్నట్లయితే, అతను ఏ భయంకరమయిన పరిణామాలను గురించి మిమ్మల్ని భయపెడుతున్నాడో వాటిలో కొన్నయితే మీపైన తప్పక తారసిల్లుతాయి. హద్దులు మీరిపోయే ఏ వ్యక్తికీ, మొండి అబద్ధాలకోరుకూ అల్లాహ్ సన్మార్గం చూపనేరడు.

44. ఇక్కడ రెండు సమానమయిన అవకాశాలున్నాయి. ఒకదాన్ని మరోదానిపైన ప్రాధాన్యతనివ్వవలసిన ఆధారం ఏదీ కానరావడం లేదు. ఒక అవకాశం ఏమిటంటే, హజ్రత్ మూసా (అ) అప్పుడు సభలో ఉండి ఉంటారు. ఆయన సమక్షంలోనే ఫిర్‌ఔన్ ఆయన్ని చంపివేయాలన్న సంకల్పం వెలిబుచ్చి ఉంటాడు. హజ్రత్ మూసా (అ) అతన్నీ అతని సభాసదుల్ని సంబోధించి ఆ సందర్భంలోనే అప్పటికప్పుడు, అక్కడికక్కడే ఈ సమాధానం ఇచ్చి ఉంటారు. రెండవ అవకాశం, హజ్రత్ మూసా లేనప్పుడు ఫిర్‌ఔన్ తన ప్రభుత్వాధికారుల సమావేశంలో ఈ అభిప్రాయాల్ని వ్యక్తపరచి ఉంటాడు. ఈ సంభాషణ సమాచారం, విశ్వాసులలోని కొందరు ప్రవక్తకు అందజేసి ఉంటారు. దీన్ని విని ఆయన తన అనుయాయుల సమావేశంలో ఈ మాట పలికి ఉంటారు. ఈ ఉభయ అవకాశాల్లోనూ ఏది సంభవించినా హజ్రత్ మూసా (అ) మాటల వల్ల స్పష్టంగా ద్యోతకమయ్యేదేమిటంటే, ఫిర్‌ఔన్ బెదరింపు వల్ల ఆయన ఆంతర్యంలో ఏ మాత్రమూ భయం కలగలేదు. ఆయన అల్లాహ్‌పైన భారం మోపి అతని బెదరింపును అతనికే త్రిప్పికొట్టారు. ఈ సంఘటనలు ఏ సందర్భంలోనయితే దివ్య ఖుర్‌ఆన్‌లో ప్రస్తావించడం జరిగిందో దాన్నిబట్టి దానంతట అదే వ్యక్తమయ్యే విషయం ఏమిటంటే, ఏ దుర్మార్గులయితే లెక్క లడిగే దినం గురించి నిర్భయులై మహనీయ ముహమ్మద్ (స)ను చంపాలని కుట్రలు పన్నుతున్నారో వారికి ఇదే సమాధానం ఆయన (స) తరఫున కూడా ఇవ్వబడుతోంది.

45. అంటే, ఆయన అతి ప్రస్ఫుటమయిన చిహ్నాలు మీకు చూపించాడు. వాటివల్ల, ఆయన మీ ప్రభువు పంపిన సందేశహరుడే అన్న విషయం తేటతెల్లమయి వ్యక్తమయింది. ఫిర్‌ఔన్ జాతిలోని ఆ విశ్వాసి సూచించిన చిహ్నాల వివరాలు ఇంతకు ముందు ప్రస్తావించబడ్డాయి. (ఖుర్‌ఆన్ అవగాహనం, సం.3, అల్ ఆరాఫ్: పాదసూచికలు 87, 89, 90, 91, 94–96 సం.4, బనీ ఇస్రాయీల్: పాదసూచికలు 113–116 తాహా, పాదసూచికలు, 29–50 సం.5, అష్ షు'అరా : పాద సూచికలు 26–39 అన్ నమ్ల్: పాదసూచి 16).

46. అంటే, ఈ అతి స్పష్టమయిన సూచనలు చూసినప్పటికీ మీరు ఇతన్ని అబద్ధాలు చెబుతున్నవాడుగా భావించినట్లయితే ఇక ఇతన్ని ఇతని మానాన వదలిపెట్టడమే మీకు తగినపని. ఎందుకంటే మరో అవకాశముంది, అది కూడా చాలా బలవత్తరమయిన అవకాశమే. అతను నిజమే పలుకుతూ ఉండవచ్చు, అతనిపై చెయ్యిచేసుకుని మీరు దేవుని అభిశాపానికి లోనవుతారేమో. అందువల్ల మీరు ఒకవేళ ఇతన్ని అబద్ధాలాడేవానిగా అనుకుంటూ ఉన్నట్లయితే అతని జోలికి పోకండి. అతను దైవం పేరు చెప్పి అబద్ధాలాడుతున్నట్లయితే దైవం స్వయంగానే ఇతన్ని చూసుకుంటాడు. దాదాపు ఇటువంటి మాటే ఇంతకుముందు స్వయంగా హజ్రత్ మూసా (అ) కూడా ఫిర్‌ఔన్‌కూ చెప్పి ఉన్నారు. "నీవు ఒకవేళ నా మాట నమ్మకపోతే నన్ను నా మానాన వదలి పెట్టు" (అద్ దుఖాన్: 21). ఇక్కడ ఒక విషయం దృష్టిలో ఉండాలి. ఫిర్‌ఔన్ జాతికి చెందిన ఆ విశ్వాసి సంభాషణ ప్రారంభంలో తాను హజ్రత్ మూసాను విశ్వసించినట్లు స్పష్టంగా వ్యక్తం చేయలేదు. ప్రారంభంలో తాను కూడా ఫిర్‌ఔన్ వర్గానికి చెందిన వ్యక్తిలానే కేవలం తన జాతి మేలును కోరి మాటలాడుతున్నట్లు మాటలాడాడు. కాని ఫిర్‌ఔన్, అతని సభాసదులు ఏ విధంగానూ సన్మార్గాన వచ్చేలా కనబడకపోయేసరికి అతను తన విశ్వాస రహస్యాన్ని బట్టబయలు చేసివేశాడు. అయిదవ రుకూలో అతని ఉపన్యాసం దీన్నే వ్యక్తం చేస్తోంది.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (3వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)

తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

# బానిస విమోచనా ప్రకరణం

**727)** హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి) కథనం ప్రకారం ప్రవక్త మహోదయులు ముహమ్మద్(సఅసం) ఇలా ప్రవచించారు: "బానిస గనక తన ప్రభువును చక్కని పద్ధతిలో ఆరాధించి, తన యజమాని యెడల శ్రేయోభిలాషిగా, విధేయునిగా మసలుకుంటే అతనికి రెండింతల పుణ్యఫలం ప్రాప్తమవుతుంది."

**728)** ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఈ విధంగా ఉద్బోధించారని హజ్రత్ అబూహురైరా (రజి) చెప్పారు: "మీలోని ఏ వ్యక్తి కూడా (తన సేవకునితోగానీ, బానిసతోగానీ) 'నీ ప్రభువు (రబ్)కు భోజన ఏర్పాట్లు చెయ్యి, నీ ప్రభువుకు వుజూ చేయించు. నీ ప్రభువుకు నీరు త్రాపు' అని అనకూడదు. 'నీ నాయకునికి', 'నీ యజమానికి' అన్న పదాలు మాత్రమే ఉపయోగించాలి. అలాగే ఎవరూ, 'నా దాసుడు, నా దాసి' అని అనకూడదు. 'మా అబ్బాయి', 'మా అమ్మాయి' 'మా బానిస' అని ఆత్మీయత ఉట్టిపడేలా పలకాలి.[1]

**730)** ప్రవక్త మహోదయులు ముహమ్మద్ (సఅసం) ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖించారు: "మీలోని ప్రతి వ్యక్తీ పాలనాధికారే. తన పాలనలో ఉన్నవారి గురించి అతన్ని ప్రశ్నించటం జరుగుతుంది. ప్రజలపై వాస్తవంగా పరిపాలన చేసే వ్యక్తి (రాజ్యాధికారి) ఒక రాజ్యాధినేతే. అతని ఏలుబడిలో ఉన్న ప్రజల విషయంలో అతను ప్రశ్నించబడతాడు. రెండవ వ్యక్తి తన ఇంటివారలపై పాలనాధికారి వంటివాడు. తన యాజమాన్యంలో ఉన్న వారి విషయంలో అతను ప్రశ్నించబడతాడు. మూడవ వ్యక్తి తన భర్త ఇంటికి, పిల్లలకు పాలనాధికారిగా ఉన్న స్త్రీ. ఈ విషయంలో ఆమె ప్రశ్నించబడుతుంది. నాల్గవ వ్యక్తి తన యజమాని (నాయకుని) సొమ్ముకు బాధ్యుడైనవాడు. దాని గురించి అతను కూడా ప్రశ్నించబడతాడు. తెలుసుకోండి! మీలోని ప్రతి ఒక్కరూ (తమ తమ స్థానాల్లో) ఒక అధికారే. ప్రతి ఒక్కరినీ వారి అధీనంలో ఉన్న వారిని గురించి (ప్రళయదినాన) ప్రశ్నించటం జరుగుతుంది.[1]

అధ్యాయం : 17

## ఎవరి సేవకుడైనా భోజనం తీసుకువస్తే...?


**732)** మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)ఈ విధంగా ఉపదేశించారని మహనీయ అబూ హురైరా (రజి) తెలిపారు: "మీ బానిస (లేక సేవకుడు) మీ కొరకు భోజనం తీసుకువచ్చినప్పుడు, అతన్ని మీతోపాటు కూర్చోబెట్టుకోండి. లేకపోతే కనీసం అతనికి ఒకట్రెండు ముద్దలయినా తప్పక తినిపించండి (లేదా ఒకట్రెండు గుప్పెళ్ళ అన్నమైనా పెట్టండి). ఎందుకంటే అతను మీ కొరకు ఎంతో శ్రమతో భోజనం తయారు చేశాడు."[1]

728-1. 'రబ్' (ప్రభువు) అని పిలవరాదని తాకీదు చేయటం జరిగింది. అలాగే దాసుడు, దాసి అని కూడా పలకరాదు. ఇలా పిలవటం అవాంఛనీయం (మక్రూహ్) మాత్రమే గాని, నిషిద్ధం (హరామ్) మాత్రం కాదు. ఉదాహరణకు : ఖుర్ఆన్‌లో "అజ్కుర్నీ ఇంద రబ్బిక" (నీ చక్రవర్తి ముందు నా గురించి ప్రస్తావించు) అన్న వాక్యం ఉంది. అయితే కేకేసి పిలిచేటప్పుడు ఆ విధంగా పిలువరాదని కొంతమంది అభిప్రాయపడ్డారు. అలాగే 'షిర్క్'కు ఆస్కారమున్న పేర్లు కూడా పెట్టకూడదు. ఉదాహరణకు- అబ్దుల్ నబీ. ముఖ్యంగా అల్లాహ్, రహ్మాన్, రహీమ్ అనేవి దేవుని పేర్లు. ఆ పేర్లు పెట్టుకునేటప్పుడు 'అబ్ద్' తప్పకుండా చేర్చాలి. అంటే అబ్దుల్లాహ్ అనో, అబ్దుర్రహ్మాన్ అనో, అబ్దుర్రహీమ్ అనో పేరు పెట్టాలి.

730-1. ఈ హదీసులో కూడా బానిస కొరకు 'అబ్ద్'(దాసుడు), యజమాని కొరకు 'సయ్యిద్' (నాయకుడు) అన్న పదాలు ప్రయోగించబడ్డాయి. ఈ విధంగా ఔపచారికంగా ఈ పదాన్ని వాడటంలో తప్పులేదు.

732-1. యజమాని తనతోపాటుగా సేవకుణ్ణి కూడా కూర్చోబెట్టుకుని తింటే అది చాలా మంచిది. ఒకవేళ ఏ కారణంగానయినా అతన్ని తనతోపాటుగా కూర్చోబెట్టుకో లేకపోయినా, అతని కోసం ఎంతో కొంత అన్నం మిగిల్చి ఉంచాలి. ఎందుకంటే అతను ఎంతో ప్రయాసతో మీ కొరకు వంట చేశాడు. ఈ విధంగా సేవకునికి పట్టెడన్నం పెట్టడం పుణ్యప్రదమని కొందరు అభిప్రాయపడ్డారు.

# మక్కాలో పున: ప్రవేశం 23



**- ఎస్.ఎమ్. మలిక్**

## జిన్నులు ఇస్లామ్ స్వీకరించడం

తాయిఫ్‌లో బాధాకరమయిన నిరాశ ఎదురయిన తరువాత మక్కాకు తిరుగు ప్రయాణం అంతగా రుచించలేదు ప్రవక్త మహనీయులకు(స). కాలినడకనే వెళ్ళాలి గనక మధ్యలో అక్కడక్కడ ఆగుతూనే ప్రయాణం సాగి ఉంటుంది. 'నఖల' అనే చోట ఆయన కొన్నాళ్ళు బస చేశారు. అక్కడ నీరూ ఉంది, చెట్లూ ఉన్నాయి. ఇక మక్కాలోకి ప్రవేశించడం ఎలా? తాయిఫ్‌లో సంభవించినదంతా  సవివరంగా మక్కాకు సమాచారం చేరి ఉంటుంది. ఇక కురైషీలు మరింతగా సాహసోపేతులయి తన పట్ల కఠోరంగా వ్యవహరిస్తారు- ఇదంతా ఆలోచిస్తూ ఆయన వ్యాకులపడుతున్నారు. అందువల్ల అక్కడ బస చేస్తూ గడిపారు. ఆ రోజుల్లోనే ఓ రాత్రి ఆయన నమాజ్‌లో కుర్‌ఆన్ పఠనం చేస్తూ ఉండగా జిన్నులు అటు నుంచి వెళ్ళడం తటస్థించింది. వారు కుర్‌ఆన్ విన్నారు. దాన్ని విశ్వసించారు. వారు వెళ్ళి తమ జాతిలో దాని ప్రచారమూ చేశారు. పరమ ప్రభువు అల్లాహ్, తన ప్రవక్తకు ఈ శుభవార్త తెలిపారు- అహ్‌కాఫ్ సూరా (46: 29-32) అవతరణ ద్వారా. తద్వారా 'మానవులు సత్య సందేశానికి  దూరంగా పరిగెడుతున్నా అనేకమంది జిన్నులు దానికి ముగ్ధులయి, విశ్వసించి దాన్ని తమ జాతిలో వ్యాపింపజేస్తున్నారు' అన్న ధైర్యం కలిగించాడు ప్రభువు!

'నఖల' నుండి బయలుదేరుతూ తిరిగి మక్కా నగరానికే పయనమవ్వాలని సంకల్పించుకున్నారు ప్రవక్త మహనీయులు(స). ఇది గమనించిన మహనీయ జైద్, "తమరు అక్కడ ఎలా ప్రవేశించగలుగుతారు? కురైష్ మిమ్మల్ని బయటికి గెంటివేశారు కదా?"అని సంశయం వ్యక్తం చేశారు. దానికి ప్రవక్తశ్రీ(స) "జైద్, నీవు చూస్తున్న ఈ పరిస్థితులు సదా ఉండవు. దైవం ఏదయినా బయటపడే దారి సృజిస్తాడు. తన ధర్మానికి ఆయనే కదా సహాయకుడు సమర్థకుడు! ఆయనే తన ప్రవక్తకు ఆధిక్యత కల్పించేవాడు కూడా" అన్నారు. ఆపైన ఆయన(స) మక్కాలో ప్రవేశించేముందు హిరా కొండ దాపున ఆగారు. అక్కడ అబ్దుల్లా బిన్ ఉరైకిత్‌ని తనకు సహాయంగా తీసుకున్నారు. ఇతను ఇస్లామ్ స్వీకరించక ఇంకా బహుదైవారాధకుడిగానే ఉన్నా మహనీయ అబూ బక్ర్(ర)కు నమ్మినబంటు. అందువల్ల  ప్రవక్తశ్రీ(స)కీ సహకరించడానికి సిద్ధంగా ఉంటాడు. అతన్ని ప్రవక్త తొలుత అఖ్నస్ బిన్ షురైక్ వద్దకు పంపి, తనకు మక్కాలో నివాస ముండటానికీ, తన సందేశ కార్యకలాపాలు నిర్వహించడానికీ శరణు కల్పించమని అర్థించారు.

## ప్రవేశం

అరేబియా తెగల వ్యవస్థలో ఏ వ్యక్తి అయినా తెగల శరణు లేకుండా నివసించజాలడు. స్వయంగా తన తెగ అండదండలు లేనివానికి మరే ఇతర తెగవారయినా శరణ్యం అనుగ్రహిస్తే అది ఉన్నంతవరకు వారు హాయిగా అక్కడ నివాసముండటానికి అనుమతి ఉంటుంది. ఇది ఆధునిక కాలంలో నాగరికత్వపు పరిమితి వంటిది. ఇంతకు అఖ్నస్, తాను స్వయంగా మరో తెగకు ఒడంబడికదారు కాబట్టి, ఇంకొకరికి తన శరణ్యం ఇవ్వలేనని నిస్సహాయత వెలిబుచ్చాడు. ఆ తరువాత ఆయన ఇబ్ను ఉరైకిత్‌ని సుహైల్ బిన్ అమ్ర్ వద్దకు అదే అభ్యర్థనతో పంపారు. అతను, ఖురైష్ ఘనాపాటి నాయకులకు ఎదురుగా ఆయన(స)కు శరణ్యం ఇవ్వడం తన వల్ల కాని పని అని తప్పించు కున్నాడు. ఆపైన అబ్దుల్లాహ్ ఉరైకిత్‌ని ఆయన(స) ముతి'మ్ బిన్ అదీ వద్దకు తన అభ్యర్థనతో పంపారు. ముతి'మ్ వెంటనే ప్రవక్త(శ్రీ)(స)ని మక్కాలోకి ప్రవేశించమని తన ఇంటికి ఆహ్వానించాడు. ఆ రాత్రికి ఆయన అతని ఇంటనే విశ్రమించారు. మరుసటి దినం ముతి'మ్, అతని కొడుకులు ఆరేడుగురు, తమ కత్తుల నీడలో ప్రవక్త(శ్రీ)(స)ని కాబా గృహంలో ప్రవేశింపజేసి, ఆయన ప్రదక్షిణ చేస్తున్నంత కాలం ఆయన రక్షణార్థం కత్తులు పట్టుకునే నిల్చున్నారు. అక్కడ అబూ జహ్ల్ ముతి'మ్‌ని అడిగాడు, "శరణు ఇచ్చావా? లేదా ఈయన్ని అనుసరిస్తున్నావా?" అని. "శరణు ఇచ్చాను" అన్నాడు ముక్తసరిగా ముతి'మ్. "అయితే సరి, నీ శరణును అతిక్రమించడం జరగదు, నీ శరణు, మా శరణ్యమే!" అన్నాడు అబూ జహ్ల్!

"ముతి'మ్ బిన్ అదీ తొలి నుంచి కూడా ప్రవక్త(శ్రీ)(స) పట్ల ఉదారంగానే వ్యవహరిస్తూ వచ్చాడు. బహిష్కరణా పత్ర భేదం లోనూ అతని పాత్ర బలమయినది. అతని ఈ ఉదార గుణాన్ని ప్రవక్త మహనీయులు(స) సదా గుర్తుంచుకునేవారు.

## మౌన ప్రచారం

ముతి'మ్ బిన్ అదీ అండగా నిలిచిన తరువాత ప్రవక్త మహనీయులు(స) వీలు చిక్కినప్పుడల్లా ధర్మప్రచారంలో ఎటువంటి లోటు రానివ్వలేదు. మక్కా నగరం కాబా గృహం కారణంగా అరేబియాలో అనేక విధాలా ఓ కేంద్ర స్థానం కలిగి ఉండేదన్న యదార్థం ముందే తెలుసుకుని ఉన్నాము. దాని మూలంగా అనేక తెగలవారు, నాయకులు, విశిష్ట వ్యక్తులు మక్కాకు రావడం జరుగుతూ ఉండేది. దైవప్రవక్త తన కర్తవ్య నిర్వహణ కొరకు అలాంటి వారినందరినీ కలుసుకోవడం సత్య సందేశం అందజేయడం తప్పక చేసేవారు. మక్కావాసులు కూడా వ్యతిరేక ప్రచారంతో ఆగంతకుల్ని హెచ్చరించి వారిలో ఉత్సుకత రేకెత్తించేవారు. 'తుఫైల్ బిన్ అమ్ర్ దౌసీ' కూడా అలాంటివారిలో ఒకరు.

'దౌస్' అనే తెగ మక్కాకు దక్షిణాన దాదాపు 250 కిలోమీటర్ల దూరాన రెండు కొండల ఆవల నివసించేది. తుఫైల్ ఏదో పని మీద మక్కా వచ్చారు. ఆయన, మేధావి, కవి, తన తెగ దౌస్‌లో పేరుగన్న వ్యక్తి. ఆయన్నిచూడగానే ఖురైష్ నాయకులకు మంచి అవకాశం దొరికినట్లయింది. అతన్ని పట్టుకుని ప్రవక్తకు వ్యతిరేకంగా నానా విధాలుగా పురికొలుపసాగారు. "నీవు ఇక్కడికి రానయితే వచ్చావు కాని జాగ్రత్త, మాలోనే ఓ వ్యక్తి మమ్మల్ని ఇక్కట్లల్లో పడవేశారు, మా సమాజాన్ని ఛిన్నాభిన్నం చేసివేశాడు, మా వ్యవహారాలన్నింటినీ తత్తర బిత్తర చేశాడు; అతని మాటల మాంత్రికుడు, తనయుని తండ్రితో, సోదర సోదరుల్లో, భార్యా భర్తల్లో వేర్పాటు బీజాలు వేస్తాడు. నీ పట్ల నీ జాతి పట్ల మాకు ఎంతో జాలి కలుగుతోంది.అతను మహా ఉపద్రవం లాంటివాడు, అతని పట్ల మాకు భయం కలుగుతోంది. అందువల్ల నీవు అతనితో మాటలాడనూ వద్దు, అతని మాట విననూ వద్దు" అంటూ అతన్ని వెంబడించి బాగా నూరిపోశారు. అందువల్ల అతను తనలో దృఢంగా సంకల్పం చేసుకున్నాడు, ముహమ్మద్ తెచ్చే ఏ మాటా వినరాదని. తెల్లారి కాబా వైపునకు వెళ్ళినప్పుడు చెవుల్లో దూది దోపుకుని మరీ వెళ్ళారు.

అయితే కాబా ప్రాంగణంలో ప్రవేశించగానే కనబడిన దృశ్యం, ప్రవక్త మహనీయులు నమాజ్ చేసుకుంటూ ఖుర్‌ఆన్ పారాయణం చేసుకుంటున్నది వినడంలో తప్పేమున్నదీ అనుకుంటూ అతను కాస్త సమీపానికి వెళ్ళి దైవం తనకు వినిపించదలచినంత మేర వినగలిగాడు, వినగానే, "అయ్యో, నా పాడుగాను, నేను బుద్ధి

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

గలవాణ్ణి, కవిని, మంచి చెబ్బరలు ఎరిగినవాణ్ణి, అలాంటప్పుడు ఇతను పలికే వచనాన్ని వినకుండా మానుకోవడంలో ఏమయినా వివేకముందా? అతని మాట విననయితే వినవచ్చుగా, బావుంటే స్వీకరించవచ్చు లేదా తిరస్కరించవచ్చు!" అలా అనుకుని కాసేపు ఆగాడు. ఆపైన ఆయన(స) నమాజ్ చేసుకుని ఇంటికి బయలుదేరారు. ఇతను కూడా ఆయన్ని వెంబడించాడు. ఆయన లోనికి ప్రవేశించ గానే తాను కూడా వెంటనే లోనికి అడుగు వేశాడు. ఆయన్ని సంబోధించి, ఖురైష్ జనులు చెప్పినదంతా వివరించాడు, తరువాత, "అయినా దైవం నాకు మీ వచనాలు కొన్ని వినిపించాడు, నేను వాటిని మంచి వచనాలుగానే గ్రహించాను. వివరంగా మీ బోధనలేమిటో నాకు తెలుపండి" అని విన్నవించుకున్నాడు.

### దౌసీ తెగ ఇస్లామ్ స్వీకారం

ప్రవక్త మహనీయులు తుఫైల్‌కు ఇస్లామ్ సిద్ధాంతాలు, వివరాలు తెలిపారు కుర్‌ఆన్ పఠించి వినిపించారు. అతను వెంటనే, "దైవం సాక్షి, ఇంతకన్నా మంచి వచనం, ఉత్తమ సిద్ధాంతం ఇంకేది కాగలదు?" అని ఇస్లామ్ స్వీకరించాడు. ఆ తరువాత, "ప్రవక్తా, నా జాతి ప్రజలు నా మాట సాధారణంగా వింటారు. నేను ఇక నా తెగవారి వద్దకు తిరిగి వెళ్ళనున్నాను, వారికి ఇస్లామ్ సందేశాన్ని అందజేస్తాను. మీరు నా కొరకు అల్లాహ్‌ను ప్రార్థించండి" అంటూ వేడుకుంటూ బయలుదేరారు.

ఇంటికి చేరగానే ముందు తండ్రి ఎదరయ్యాడు. తండ్రికి ఇస్లామ్ సందేశాన్ని అందజేసి ఒప్పించాడు. తరువాత భార్యను కలిసి ఆమెను పరిశుద్ధపరచి ఇస్లామ్ సందేశాన్ని అంగీకరింపజేశాడు. ఆ తరువాత తుఫైల్ తన తెగ వారి అందరికీ ఇస్లామ్ సందేశాన్ని అందజేశాడు. అయితే వారు సత్యధర్మాన్ని స్వీకరించడంలో అలసత్వం కనబరిచారు. అతను మక్కాకు తిరిగి వెళ్ళి తన తెగవారి మొండి వైఖరి, వారి అశ్లీల ప్రీతి కారణంగా వైముఖ్యాన్నీ తెలిపి వారి కోసం ఏదయినా శాపనార్థకమయిన ప్రార్థన చేయండి అని దైవ సందేశహరుల వారిని అర్థించాడు. కారుణ్యమూర్తి మహనీయ ముహమ్మద్(స) ఆ తెగ జనుల శ్రేయం కొరకు, వారి హృదయాలు ఇస్లామ్ మార్గాన్ని చూడగలిగేలా ప్రార్థన చేసి, తుఫైల్‌ని వెళ్ళి సందేశ ప్రచార కార్యం చేస్తూ ఉండమని, ఎట్టి పరిస్థితిలోనూ తన వారి పట్ల మృదువైఖరి కలిగి ఉండమని, మానవుల పట్ల నిరాశ నిషిద్ధమని బోధించి త్రిప్పి పంపారు. కొంతకాలానికి దౌస్ ప్రజలు అందరూ ఇస్లామ్ ధ్వజవాహకులుగా పరివర్తనం చెంది తుఫైల్‌తో కలిసి హిజ్రత్ తరువాత ప్రవక్త(స)ని మదీనాలో కలుసుకున్నారు.

---

*__ఆధారం :__ 1) సీరతున్నబీ కామిల్, ఇబ్ను హిషామ్ సం.1; పు.419-422*

*2) సీరతె సర్వరె ఆలమ్ : సం.2; పు.517-519*

*3) సీరతె ఇన్‌సైక్లోపీడియా : సం.3; పు.470-476*


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# ఈద్ మిలాప్ వేదికలు  మత సామరస్యానికి ప్రతీకలు









**ఒకవైపు** మతతత్వ వాదులు తమ విషం చిమ్మే వ్యాఖ్యలతో అన్నదమ్ముల్లా కలిసింటున్న హిందూ ముస్లిముల మధ్య చిచ్చుపెట్టాలని, దేశమంతా విద్వేషాగ్నిని రగిల్చి ఆ మంటల్లో రాజకీయ వంటలు వండుకోవాలని చూస్తున్నారు. మరోవైపు జమాఅతె ఇస్లామీ హింద్ సంస్థ దేశవ్యాప్తంగా మత వర్గాల మధ్య సోదరభావాన్ని, మత సామరస్యాన్ని పెంచే కార్యక్రమాలకు నడుం బిగించింది. గంగా–జమునా మేలుకలయిక అయిన భారత విశిష్ఠతను కాపాడుకునేందుకు, మతాలు, కులాలు వేరైనా తామంతా ఒక్కటేననే సందేశం ఇచ్చేందుకు దేశవ్యాప్తంగా ఈద్ మిలాప్ సమావేశాలు నిర్వహిస్తోంది. అన్య మత వర్గాల నాయకులంతా ఒకే వేదికపైకి వచ్చి తామంతా ఒక్కటేనని, తమను ఎవ్వరూ విడదీయలేరనే సందేశాన్నిస్తుండటం శుభపరిణామం. ఈ వేదికపై అంతా కలిసి చేయిచేయి కలిపి సమైక్యతను ప్రదర్శిస్తున్నారు. ఈ ఈద్ మిలాప్ సమావేశాలు నిర్వహించడంలో తెలంగాణ, ఏపీ జమాఅతె ఇస్లామీ హింద్‌లు ముందంజలో ఉన్నాయని చెప్పవచ్చు. నిజామాబాద్, జహీరాబాద్, ఖమ్మం, సంగారెడ్డి, నిర్మల్, హైదరాబాద్, విజయవాడ, కడప, నగరాలలో నిర్వహించిన ఈద్ మిలాప్ సమావేశాలకు విశేష స్పందన లభించింది. ఆయా సమావేశాలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జమాఅత్ అధ్యక్షులు హామిద్ ముహమ్మద్ ఖాన్, ముహమ్మద్ రఫీఖ్ చేసిన అధ్యక్ష ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మానవత్వం, మత సామరస్యం, సోదరభావాన్ని పెంచేలా ప్రసంగాలు సాగాయి. అంతా కలిసి ఒకే వేదికను పంచుకోవడం, షీర్ ఖుర్మా పాయసాన్ని ఆరగించడం భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటింది.






**ఏ విధమైన** సమాచారాన్నయినా, ఒకరి నుండి మరొకరికి బదిలీ చేయడానికి ఏదైనా ఒక పరికరం/ఒక వాహకం/ మాధ్యమం అనేది కావాలి. విద్యాపరంగా చూస్తే ఈ భావ ప్రకటనా పద్ధతులు రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్నాయి. ఈ అభివృద్ధిలో సాంకేతికత అనేదానికి మరింత సుదీర్ఘమైన చరిత్రే ఉంది.

మెరుగైన సమాజం, మెరుగైన ఆర్థిక వ్యవస్థలను సాధించడానికి ఇంటర్నెట్, ఇతర సమాచార మరియు కమ్యూనికేషన్ టెక్నాలజీలను (ICT) ఏవిధంగా ఉపయోగించుకోవాలనే విషయం గురించి అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం మే 17వ తేదీన ప్రపంచ టెలికమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ సొసైటీ దినోత్సవాన్ని (WTISD) జరుపుకుంటారు.

వేల సంవత్సరాలుగా, సుదూర ప్రాంతాలకు సంక్లిష్ట సందేశాలను పంపే అత్యంత వేగవంతమైన పద్ధతి గుర్రంపై జరిగేది. 18వ శతాబ్దం చివరలో, క్లాడ్ చాప్పే ఫ్రాన్స్ అంతటా దృశ్య సెమాఫోర్ స్టేషన్ల నెట్వర్కును ప్రారంభించారు. సెమాఫోర్ అంటే ఒక ప్రదేశం పరిస్థితి గురించి వ్యక్తులకు తెలియజేయడానికి చాలా దూరం నుండే వేగంగా సంకేతాలు అందించడం అని చెప్పవచ్చు. దృశ్య పరంగా కనెక్ట్ చేయబడిన నెట్వర్కులో సెమాఫోర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం ద్వారా టెలిగ్రఫీ, రైల్వే సిస్టమ్లలో, నగరాల్లో ట్రాఫిక్ లైట్లు, ట్రాఫిక్ సిగ్నలింగ్ వంటివాటి పని చేయిస్తుంటారు.

ఆ తర్వాత విద్యుత్ విప్లవం వచ్చింది. వైర్లతో పాటు విద్యుత్ సంకేతాలను పంపడం వల్ల సాంకేతిక ప్రయోగాలు మరింత పెరిగాయి. 1839లో, చార్లెస్ వీట్స్టోన్ రూపొందించిన వ్యవస్థతో ప్రపంచంలోని మొట్టమొదటి వాణిజ్య టెలిగ్రాఫ్ సేవ లండన్‌లో ప్రారంభించబడింది. యునైటెడ్ స్టేట్స్‌లో, శామ్యూల్ మోర్స్ 1844లో తన మొదటి టెలిగ్రాఫ్ సందేశాన్ని పంపడానికి కొత్త మోర్స్ కోడ్‌ను ఉపయోగించాడు.

స్కాటిష్ ఆవిష్కర్త ఐన అలెగ్జాండర్ బైన్ తన "ఎలక్ట్రిక్ ప్రింటింగ్ టెలిగ్రాఫ్" కోసం మే 27, 1843న బ్రిటిష్ పేటెంట్ 9745ను అందుకుని 1846లో ప్రయోగాలలో "గ్రాఫిక్ సంకేతాలను పునరుత్పత్తి" చేయగలిగాడు. ఆ రోజు ఆ విధంగా మొదలైన సమాచార బదిలీ విప్లవం ఎన్నో కొత్త పుంతలు తొక్కి టెలిఫోన్, మొబైల్ ఫోన్, నేడు స్మార్ట్ ఫోన్‌గా మారింది. ముందు ముందు ఇది ఇంకా ఎన్ని కొత్త సాంకేతిక ఆవిష్కరణ లను రూపొందిస్తుందో మనం చెప్పలేం. ఇవన్నీ కేవలం శాటిలైట్ ప్రయోగాల ద్వారానే సాధించగలిగాం.

ఒకప్పుడు సమాచార బదిలీ కోసం పక్షులను, జంతువులను, తర్వాత ఉత్తరాలను ఉపయోగించుకున్న మనం ఈ రోజు కూర్చున్న చోటు నుండి కదలకుండా సమాచారాన్ని సేకరిస్తున్నాం. సమాచారాన్ని బదిలీ చేస్తున్నాం. నగదు వ్యవహారాలన్నీ పూర్తి చేస్తున్నాం. ఈ రోజు స్మార్ట్ ఫోన్ లేని చేయి ఏదైనా ఉందంటే

నమ్మలేం. ఒకప్పుడు ఉత్తరం రాయాలంటే చదువుకుంటేనే సాధ్యమయ్యేది. కానీ నేడు స్మార్ట్ ఫోన్‌కి చదువు కూడా అవసరం లేదు. అన్ని పాత్రలను అదే పోషించేస్తుంది. గ్రంథాలయం, డిక్షనరీ, calculator, గడియారం, కెమెరా, అలారం, బ్యాంకు, టెలిఫోన్, ఉత్తరం, రేడియో, పుస్తకం, టేప్ రికార్డర్, నోట్‌బుక్, పెన్, పెన్సిల్ అన్ని రకాల రవాణా సాధనాలకు టికెట్ కౌంటర్, ఎంక్వయిరీ కౌంటర్ ఇలా మరెన్నో పాత్రలు. ఒకప్పుడు ఈ పాత్రలన్నీ పోషించడానికి రకరకాల మనుషులు, రకరకాల వస్తువులు అవసరం అయ్యేవి. ఇప్పుడు అవన్నీ కనుమరుగైపోయాయి. చివరికి సమావేశ మందిరం కూడా ఈ రోజు మొబైల్ స్మార్ట్ ఫోనే అయిపోయింది. చివరకు స్కూల్స్, కాలేజీలకు వెళ్లకుండానే డిగ్రీ పట్టాలు సంపాదించుకుంటున్నాం. ఇవన్నీ శాటిలైట్ ప్రయోగాల ద్వారా మనిషి సంపాదించిన ఘనత. ఒకప్పుడు మొబైల్ స్మార్ట్ ఫోన్ అనేది విలాస వస్తువుగా ఉండేది. కానీ ప్రస్తుత సమాజంలో మొబైల్ స్మార్ట్ ఫోన్ అనేది తప్పనిసరి సాధనం అయిపోయింది. కానీ ఈ ఘనత భౌతికవాదాన్ని పెంచి పోషిస్తోంది కానీ నైతిక వాదాన్ని దిగజారుస్తోందనేది ఏ ఒక్కరూ కాదనలేని సత్యం.

సమాచార మార్పిడి జరిగినప్పుడు అది కేవలం కొందరికే కాకుండా అన్ని వర్గాల ప్రజలకూ అర్థమయ్యే రీతిలో ఉండాలి. అందుకు ఒక సామాన్యమైన సమాచార రంగం అందుబాటులో ఉండాలి. అంతేకాదు ఎటువంటి అడ్డంకి లేని ఒక విజయవంతమైన సమాచార వేదిక కావాలి. ఒకే సమయంలో అనేక వార్తలు, అనేక మందికి పంపగలగాలి, అనేక మంది నుండి సమాచారం రాబట్టుకోవాలి. ఇవన్నీ కేవలం ఈ రోజు మనం మొబైల్ ఫోన్ ద్వారానే పొందగలుగుతున్నాం. అందుకే ఈ రోజు అత్యంత నాణ్యమైన సమాచార వేదికతో పాటు అత్యంత చవకైన సమాచార వేదిక మొబైల్ ఫోన్ అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

టెలిగ్రఫీ, ఉత్తర ప్రత్యుత్తరాలు వంటి ఇతర సమాచార పద్ధతులలో సమాచార సంకేతాలు ఒక వ్యక్తి నుండి మరొకరికి మాటలు, రాతపూర్వకంగా సమాచారం బదిలీ జరిగేది. ఈ పద్ధతిలో ఏ విధమైన శారీరక కదలికలతో గాని, శబ్ద లేదా మాటల శ్రావ్యతతో సంబంధం లేకుండా సమాచార మార్పిడి జరిగేది. లిఖితపూర్వక భావప్రకటనలో వ్యాకరణం కీలకపాత్ర పోషిస్తుంది. విద్యాలేమి, వ్యాకరణ దోషాలు వల్ల ఒక్కొక్కసారి అర్థమే మారిపోయే ప్రమాదం ఉండేది. దారుణమైన అపార్థాలు జరగకుండా ఉండాలంటే ప్రకటనదారు అంటే సమాచారకర్తకు భాష, వ్యాకరణం పై పట్టు కలిగి ఉండాలి, సమాచారాన్ని బదిలీ చేయడానికి ముందే మరిన్ని సార్లు చదువుకుని, జాగరూకతతో వ్యవహరించాల్సి వచ్చేది.

తర్వాత టెలిఫోన్ ద్వారా కేవలం అవతలి వ్యక్తి గొంతు మాత్రమే వినగలిగేవాళ్ళం. దీనికి కూడా పెద్దగా చదువుతో అవసరం లేకపోయినా ఆర్థిక అసమానతల వల్ల ఈ టెలిఫోన్ వ్యవస్థ సామాన్యులకు అందుబాటులో ఉండేది కాదు. నేడు కూడా చాలా మంది టెలిఫోన్ వ్యవస్థకు దూరంగానే ఉంటున్నారు.

అంతేకాదు పూర్వకాలంలో ఈ టెలిఫోనులు గోడకి తగిలించో, బల్ల మీదనో కదలకుండా ఒక చోట పడి ఉండేవి. ఫోనులో మాట్లాడాలంటే మనమే ఫోను దగ్గరకి వెళ్లాల్సి వచ్చేది. తర్వాత 1979లో ఎక్కడకి పడితే అక్కడకి చేత్తో పట్టుకుపోయే సౌకర్యం కలిగిన ఫోన్ మొట్టమొదట జపానులోని టోకియో నగరంలో వెలుగులోకి వచ్చింది. అంటే ఇది ఒక వైర్ లెస్ ఫోన్. ఈ రకం టెలిఫోనుని ఇంగ్లీషులో ''మొబైల్ ఫోన్'' అనడం మొదలు పెట్టారు. టోకియోలో జరిగిన ప్రయోగం విజయవంతం అవడంతో ఈ పద్ధతి ఐరోపాలోని కొన్ని దేశాలలో వ్యాపించింది. 1983లో మోటరోలా కంపెనీ అమెరికాలో ఈ రకం టెలిఫోనులకి ప్రాచుర్యం కల్పించింది. అప్పుడు దీని బరువు 2.2 పౌండ్లు (1kg). అమెరికాలో పట్టణాలు విశాలంగా విస్తరించి ఉండడం వల్ల చాలా దూరం నెట్‌వర్క్ అందడానికి అనుకూలంగా మొబైల్ ఫోన్‌లు తయారు చేయడం జరిగింది. ఈ పరిస్థితులకి అనుకూలంగా ఉండే విధంగా మోటరోలా కంపెనీ, తేనెపట్టులో గదుల మాదిరి, ఒక నిస్తంతి వలయం (సెల్యులార్ నెట్వర్క్) రూపొందించి, ఆ వలయంలో ఈ టెలిఫోనులు పనిచేసే సాంకేతిక వాతావరణం సృష్టించింది. అందుకని, అప్పటినుండి అమెరికాలో ఈ మొబైల్ ఫోన్ ని ''సెల్యులార్ ఫోన్'' అనీ, ''సెల్ ఫోన్'' అనీ, చివరికి

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

"సెల్" అనీ పిలుస్తున్నారు. ఈ సాంకేతిక పరిధిని మొదటి తరం (1 G or First Generation) అని కూడా అంటారు.

టెలి కమ్యూనికేషన్ మాదిరిగానే మొబైల్ / సెల్ కమ్యూనికేషన్ అనేది కూడా ఒక సమాచార బదిలీ ప్రక్రియ. సెల్‌ఫోన్ పని చెయ్యడానికి అత్యవసరమైన విద్యుత్తుని సరఫరా చెయ్యడానికి లిథియం అణుశకలాలతో పనిచేసే ఒక విద్యుత్ ఘటం (Lithium-ion battery cell). చేతిలో ఇమిడే అంత చిన్న సెల్‌ఫోన్‌లో అవసరమైనన్ని టెలిఫోను నంబర్లు ఎక్కించడానికి కావలసిన మీటల ఫలకం "కీ బోర్డ్" ఇమడ్చడానికి చోటు సరిపోదు. అందుకని స్పర్శతో స్పందించ గలిగే స్పర్శ ఫలకం టచ్ పాడ్ అవసరమయ్యింది. ఇదే స్మార్ట్‌ఫోన్ తయారీకి నాంది పలికింది.

తరువాత 1991 లో ఫిన్‌ల్యాండ్‌లో రెండవ తరం (2 G) ఫోనులు అందుబాటులోకి వచ్చాయి. తరువాత కొంత సాంకేతికతను అందిపుచ్చుకుని అంచెలంచెలుగా ఇప్పుడు మనం 5G (5th Generation) దగ్గర ఉన్నాం. ఈ తరాల మార్పుతో సరితూగుతూ కొత్త కొత్త వెసులుబాట్లు "ఫీచర్స్"తో ఫోనులు బజారులోకి వస్తు న్నాయి. ఈ రోజు మనిషి జీవితం మొత్తం ఈ స్మార్ట్‌ఫోన్‌తోనే ముడిపడి ఉంది.

ఇక ఈ స్మార్ట్ ఫోన్‌లలో వాడే ఆండ్రాయిడ్ అనే సాఫ్ట్‌వేర్‌ని ఆండీ రుబిన్ అనే వ్యక్తి రూపొందించాడు. నిజానికి కెమెరాల్లో ఫొటోలను కంప్యూటర్లోకి ఎక్కించడానికి దీన్ని తయారు చేశాడు. అది భవిష్యత్తులో ఇంత అద్భుతాన్ని సృష్టిస్తుందని వూహించని ఆండీ రుబిన్, గూగుల్ సంస్థకు తక్కువ మొత్తానికే దాన్ని అమ్మేశాడు. ఆ తరువాత నుంచి గూగుల్ దాన్ని అప్డేట్ చేస్తూ వస్తోంది.

ఇప్పుడు మనం ఉన్నది ఇంటర్ నెట్ యుగంలో. ఈ ఇంటర్‌నెట్ యుగం యొక్క ప్రత్యేక లక్షణం ఏమిటంటే మెరుగైన చదువుతో గానీ, ఉన్నతమైన ఆర్థిక స్థితితో గానీ దీనికి సంబంధం లేదు. తేలికగా, చవకగా ప్రజలందరికీ అందుబాటులోకి వచ్చేసింది. ప్రస్తుత ఇంటర్నెట్ యుగం లిఖితపూర్వక భావప్రకటన యొక్క స్వరూపాన్నే మార్చివేసింది. కాగితం, కలం అవసరం లేకుండానే ఈ-మెయిల్ ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సాధనాలతో అనునిత్యం లెక్కలేనన్ని లిఖితపూర్వక భావప్రకటనలు జరుగుతున్నాయి.

సెల్‌ఫోన్‌ల వల్ల మనకు కలిగే ఉపయోగాల్లో సెల్ఫోన్లో ఈసీజీ అనేది చెప్పుకోదగ్గ ఉపయోగం. గుండెపోటు ముప్పును పసిగట్టి తక్షణం వైద్యసాయం పొందటం అవసరం. బ్లాక్బెర్రీ స్మార్ట్ఫోన్ల వినియోగదారులు తమ ఈసీజీ వివరాలను ఉన్న చోటు నుంచే వైద్యులకు చేరవేయవచ్చు. ఈ నివేదికను హృద్రోగ నిపుణులు పరిశీలించి రోగి ఎలాంటి చర్యలు తీసుకోవాలో తక్షణం వివరిస్తారు.

టెలీ ఎడ్యుకేషన్ ద్వారా వ్యవసాయానికి కావలసిన, ఎరువుల ఎంపిక, ఎరువుల వాడకం, మార్కెట్ ధరలు, మేలైన సాగు విధానాలు, మొక్కల సంరక్షణ, సస్యరక్షణ, వాతావరణం, ముఖ్య మైన పంటల వివరాలు మొదలైన సమస్త సమాచారాన్ని కూడా రైతులు తమ ఇళ్ల వద్దనే ఉండి పొందవచ్చు.

మొబైల్ ఫోన్‌ల ద్వారా విడుదల అయ్యే విద్యుత్ అయస్కాంత తరంగాల కారణంగా మాట్లాడుతున్నప్పుడే కాదు, పక్కన పడేసిన ప్పుడూ సెల్‌ఫోన్ నుంచి అధికంగా రేడియేషన్ వెలువడుతుంది. అందువల్లనే సెల్‌ఫోన్‌ని నిద్రపోయేటప్పుడు తల పక్కనే పెట్టుకొని అలారం గడియారంలా వాడకపోవటమే మంచిది. సెల్‌ఫోన్‌ను ప్యాంటు జేబులో పెట్టుకున్నా, బెల్టుకు ధరించినా సంతాన సామర్థ్యంపై ప్రభావం చూపుతుంది అని కొన్ని విశ్లేషణలు తెలియజేస్తున్నాయి. అందువల్లే వీలైనప్పుడల్లా సెల్‌ఫోన్‌ను దూరంగా ఉంచటం మేలు.

పెట్రోలు బంకుల దగ్గర మనం సెల్ఫోన్ వాడేటప్పుడు సున్నిత మైన విద్యుత్ పరికరాల్లో కూడా విద్యుత్ ప్రేరణ జరిగే అవకాశం ఉంది. వీటికి ఓ దిశ, దశ పద్ధతి లేకపోవడం వల్ల విద్యుత్ సర్క్యూట్తో స్పార్కులు రావచ్చు. అంటే అగ్ని ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుంది. అందువల్లే పెట్రోల్ పంపుల దగ్గర సెల్ఫోన్లు వాడకపోవడం మంచిది.

ఇదంతా కేవలం సాంకేతిక విప్లవం ద్వారా వచ్చిన మార్పు మాత్రమే. ఏది ఏమైనప్పటికీ సాంకేతికత అనేది మనిషి పురోగతికి

యువతరానికి విప్లవనాదం
చేతన వాదం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

మార్గం వేయాలనేది సదరు సాంకేతికత ఉద్దేశ్యం మరియు ప్రజలందరి ఉద్దేశ్యం కూడా. కానీ ఈ రోజు మనిషి కనిపెట్టిన సాంకేతికత మనిషిని సాంకేతికంగా ముందుకు తీసుకెళ్తోంది గానీ, నైతికంగా దిగజారుస్తోంది. ఇరువురి మధ్య భావప్రకటనలో జ్ఞానము, అనుభవాలు, సలహాలు, సూచనలు ఇచ్చి పుచ్చుకోవడం, ప్రశ్నించుకోవడం వంటివి ఆరోగ్యకరంగా ఉండాలి. సమర్థవంతమైన భావప్రకటనలు, సమాచారం యొక్క నైపుణ్యత ప్రతిబింబించాలి.

ఈ రోజు సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవడానికి మాత్రమే ఉపయోగించాల్సిన మొబైల్ ఫోన్‌ని అనవసరాల కోసం వాడుకోవడం ఎక్కువయిపోయింది. అతిగా స్మార్ట్‌ఫోన్ వాడకం అనేది ఎన్నో శారీరక, మానసిక సమస్యలకు కారణమవుతుంది. సోషల్ మీడియా వ్యసనం లేదా ఇంటర్నెట్ అడిక్షన్ డిజార్డర్‌కు ఇతర రకాల డిజిటల్ మీడియా మితిమీరిన వినియోగానికి దగ్గరి సంబంధం ఉందని కొంత మంది పరిశోధకులు ప్రతిపాదించారు. అతి చవకగా మొబైల్ నెట్ వర్కింగ్ అందుబాటులో వచ్చిన కారణంగా, మొబైల్ ఫోన్ వినియోగం ప్రతి ఒక్కరిలోనూ అధికమైపోయింది. దీని కారణంగా మిగిలిన పనులన్నీ పక్కన పెట్టి మొబైల్ వినియోగాన్ని ఒక వ్యసనంగా చేసుకునే పరిస్థితిలోనే నేడు చాలామంది యువకులు ఉన్నారు. పెరిగిన మొబైల్ ఫోన్ వినియోగం మానవ సంబంధాలను మంట కలిపేసింది. మనుషుల మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలకు దారి తీస్తోంది. మొబైల్ అడిక్షన్‌కి కారణమవుతోంది. కొంతసేపు మొబైల్ ఫోన్‌కి దూరంగా ఉండవలసి వస్తే తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారు. అప్పుడే ఊహ తెలుస్తున్న పిల్లల నుండి నడివయసువారి వరకు సమస్యాత్మక స్మార్ట్‌ఫోన్ వినియోగానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు.

వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పురోగతి కారణంగా, చైనా, ఇండియా వంటి ఆసియా దేశాలలో స్మార్టుఫోన్ మితిమీరిన వినియోగం ఒక పెద్ద ముప్పుగా పరిణమించింది. భారతదేశంలో 2021 లెక్కల ప్రకారం సుమారు 49.278 కోట్ల మంది స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్నారని ఒక అంచనా. ఇది దేశ జనాభాలో 35.4 శాతం. అంటే ప్రతి ఇంట్లోనూ వృద్ధులను, పసిపిల్లలను తీసివేస్తే మిగిలిన అందరి దగ్గర స్మార్ట్ ఫోన్ ఉంది.

డిజిటల్ మీడియా మితిమీరిన వినియోగం కంటి సమస్యలతో ముడిపడి ఉంది, ముఖ్యంగా చిన్న వయస్సులో. 2050 నాటికి ప్రపంచ జనాభాలో 49.8% (4.8 బిలియన్లు) డిజిటల్ మీడియా మితిమీరిన వినియోగంతో మయోపియాతో ప్రభావితమవుతారని అంచనా వేయబడింది. మయోపియా అనేది ఒక సాధారణ దృష్టి లోపం. ఈ లోపం ఉన్నపుడు మీకు సమీపంలో ఉన్న వస్తువులను స్పష్టంగా కనిపించవచ్చు. కానీ దూరంగా ఉన్న వస్తువులు అస్పష్టంగా కనిపిస్తూ ఉంటాయి. కంటి ఆకారం, కాంతి కిరణాలు వక్రీభవనానికి కారణమైనప్పుడు, ఇది రెటీనా పై ఎక్కువ ప్రభావం చూపించి, దృష్టిలోపానికి కారణమవుతుంది.

మొబైల్ ఫోన్ల మితిమీరిన వినియోగం మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రతికూల ఫలితాలతో ముడిపడి ఉంటుంది.

మరొక దరిద్రం ఏమిటంటే వాడుతున్న మొబైల్ ఫోన్‌లను ఎప్పటి కప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోకపోవడం, శానిటైజ్ చేయకుండా ఎలా పడితే అలా వాడడం. 2011లో క్వీన్ మేరీలోని లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ & ట్రాపికల్ మెడిసిన్ పరిశోధనలో ఆరుగురి సెల్ ఫోన్లలో ఒకటి మల పదార్థంతో కలుషితమైందని సూచించింది. తదుపరి పరిశీలనలో, మల పదార్థంతో కూడిన కొన్ని ఫోన్లు ఈ కోలి వంటి ప్రాణాంతక బ్యాక్టీరియాను కూడా కలిగి ఉన్నాయి, దీని ఫలితంగా జ్వరం, వాంతులు, విరేచనాలు కావచ్చు.

మొబైల్ ఫోన్‌ల కారణంగా ఇప్పుడు ఆడపిల్లలపై వేధింపులు, పెద్ద మొత్తంలో ఆర్థిక నేరాలు లాంటివి పెరుగుతున్నాయి. మొబైల్ ఫోన్ వినియోగదారులు ఒత్తిడి, నిద్ర భంగం, డిప్రెషన్ లక్షణాలు, ముఖ్యంగా చాలామంది యువకులలో కూడా ఉన్నాయి.

అనేక అధ్యయనాలు స్మార్ట్ ఫోన్ వినియోగదారుల మానసిక, ఆరోగ్య సమస్యలు మరియు వారికి ఉన్న స్మార్ట్ ఫోన్ వ్యసనం మధ్య సంబంధాలను కనుగొన్నాయి. 2019లో ప్రపంచ ఆరోగ్య సంస్థ 0-5 ఏళ్లలోపు పిల్లలకు చురుకైన జీవనశైలి, నిద్ర మరియు స్క్రీన్ సమయం (మొబైల్ వినియోగం) గురించి సిఫార్సులను జారీ చేసింది. ఈ సిఫార్సుల ప్రకారం ఒక సంవత్సరం కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు: 30 నిమిషాల శారీరక శ్రమ, రోజుకు 14 - 17 గంటల నిద్ర సమయం అవసరం. ఇక మొబైల్ ఫోన్ అయితే అసలు ఇవ్వకూడదని సూచించింది. అలాగే ఒకే సంవత్సరం ఉన్న పిల్లలకు 180 నిమిషాల శారీరక శ్రమ, 0 గంటల స్క్రీన్ సమయం, రోజుకు 11-14 గంటల నిద్ర సమయం సూచించింది. 2 సంవత్సరాలు దాటిన పిల్లలకు మాత్రమే రోజుకు కేవలం ఒక గంట కంటే ఎక్కువ మొబైల్ ఫోన్ చేతికి ఇవ్వరాదని సూచించింది. ◆




**దైవప్రవక్త(స) సహచరులు రమజాన్ నెల తర్వాత ఆరు మాసాల పాటు తమ ఆరాధనలు స్వీకరించబడాలని ప్రార్థిస్తూ ఉండేవారు. మిగతా నెలలు మరో రమజాన్ నెలను పొందే భాగ్యాన్ని ప్రసాదించాలని దైవాన్ని వేడుకునేవారు.**

**రమజాన్** ముస్లింల విశ్వాస కుసుమాలను వికసింప చేసే వరాల వసంతం. దైవ ప్రసన్నత దైవభీతి పరాయణతల సాధనకు అనుకూలమైన రుతువు. దేవుని కారుణ్య కడలిని ఆయన మన్నింపు కెరటాలను ఉప్పొంగించే మహోజ్వలమైన మాసం. ఇప్పుడిది వీడ్కోలు తీసుకుంది. అపార దైవానుగ్రహాలను వర్షింప చేసే శుభాల సీజన్ కనుమరుగైపోయింది. బాధాతప్త హృదయాలతో విశ్వాసులు వీడ్కోలు చెప్పారు.

అయితే ఈ శుభ మాసంలో ఉపవాసాలు పాటిస్తూ నమాజులు చేస్తూ ఖుర్ఆన్ పఠిస్తూ బీదసాదలకు సహాయం చేస్తూ పూర్తి జీవితాన్ని దేవుని విధేయతా పరిధిలో గడిపిన వారు ఎంతో అదృష్టవంతులు. నిరంతరాయంగా దైవానుగ్రహాలు వర్షించే ఈ నెలలో ఉపవాసాలు పాటించకుండా పగటి వేళల్లో తింటూ తాగుతూ రాత్రి వేళల్లో పొద్దుపోయేదాకా వ్యర్థ పనులలో కాలక్షేపం చేసి పొద్దెక్కే దాకా పక్క వదలని వారు ఎంతో దురదృష్టవంతులు.

శాశ్వతమైన సుందర స్వర్గ సౌఖ్యాలు వదులుకొని అశాశ్వత మైన ప్రాపంచిక తళుకుబెళుకులకు దాసోహం చేసేవారు అవివేకులనే చెప్పాలి. అంతేకాకుండా గతేడాది మనతో ఉన్న మనవాళ్లు, అయినోళ్ళు ఈ ఏడాది లేరు. అయితే ఈ పవిత్ర మాసాన్ని పొంది, సత్కార్యాలు చేసుకొనే భాగ్యాన్ని మనకు ప్రసాదించిన దైవానికి వేనవేల కృతజ్ఞతలు తెలుపు కుందాం.

ఈ నెల రాగానే ముస్లిం సమాజంలో ఒక పెను మార్పు సంభవించింది. క్రమశిక్షణతో పాటు అధర్మమైన, అసత్యమైన పనులకు దూరంగా ఉన్నారు. తమ ప్రభువుకు అయిష్టమైన పనుల దరిదాపులక్కూడా వెళ్లే సాహసం చేయకుండా పూర్తి నిబద్ధతతో ఉన్నారు. నిన్న మొన్నటి వరకూ నమాజ్ చేయని వారు కూడా ఐదు పూటల నమాజీలుగా కనిపించారు. మస్జిదులు నిండిపోయాయి. దానధర్మాల పరంపర, దైవ గ్రంథంతో పటిష్ట బంధం, ఎటు చూసినా ఆధ్యాత్మికం, మనసుకు హాయిని కల్పించే ఆహ్లాదకరమైన వాతావరణం అంతటా కనిపించింది.

అయితే ఈ నెల ముగిసిన వెంటనే మళ్లీ యథాస్థితికి చేరుకున్నాం. వదిలేసిన చెడులన్నీ మళ్లీ చిన్నగా దాపురించాయి. ఇందుకేనా మనం ఉపవాసం పాటించింది? ఇదేనా రమజాన్ నెల నేర్పే శిక్షణ? ఏ ఆశయ సాధన కోసం ఇంతటి కఠోర దీక్షకు పూనుకున్నాం మనం?? ఉపవాసాలు పాటిస్తూ తరావీహ్ నమాజులు చేసినంత మాత్రాన మనం దాని శుభాలను పొందగలిగామా??

ఒకసారి ప్రశాంతంగా ఆలోచిద్దాం. ఆత్మ పరిశీలన చేసుకుందాం...

రమజాన్ శుభాలకు అర్హులు కావాలంటే మన అంతరంగాల్లో దైవభీతి దృఢంగా నాటుకోవాలి. దాని ప్రభావం మన దైనందిన జీవితంలో కనిపించాలి. ఈ విషయాన్నే దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు:

"ఎందరో ఉపవాసం పాటించే వారికి తమ ఉపవాసాల ద్వారా ఆకలి దప్పికలు తప్ప మరేమీ లభించవు. అలాగే ఎందరో తరావీహ్ నమాజ్ చేసే వారికి జాగరణ తప్ప మరేమి ప్రాప్తం కాదు."

దైవభీతి పరాయణత ఒక్క రమజాన్ నెలలోనే కాకుండా మిగతా మాసాల్లోనూ కనిపించాలి. అది మస్జిద్‌లోనే కాకుండా, మస్జిద్ వెలుపల బజారుల్లో, ఇండ్లల్లో, దుకాణాల్లో, కార్యాల యాల్లో, కార్ఖానాల్లో కనిపించాలి. ఏదైనా వ్యవహారంలో తప్పు చేస్తున్నప్పుడు వెంటనే దేవుడు చూస్తున్నాడని గుర్తుకురావాలి. ఆయనకు భయపడాలి. దైవ భయమే మనిషిని చెడుకు దూరంగా ఉంచగల్గుతోంది.

మన హృదయంలో మంచి పట్ల అభిమానం చెడు పట్ల వెగటు కలగాలి. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఒత్తిళ్లకు లొంగకుండా కేవలం దైవ ప్రసన్నత కోసం చెడులను మాని మంచిని అవలంబించాలనే కోరిక కలగాలి. అధర్మ విషయాలను పూర్తిగా వదిలేసి దైవ ధర్మం మోపిన బాధ్యతలను నిర్వహించే కృషి చేయాలి.

ఈ విధేయత భావం ఈ ఒక్క మాసంలోనే కాకుండా సంవత్సరంలోని మిగతా పదకొండు నెలలూ సజీవంగా ఉండేలా రమజాను ఉపవాసాలు మనకు శిక్షణ ఇస్తాయి. హృదయంలో దైవభీతి, జీవిత వ్యవహారాల న్నింటిలో దాని ప్రభావం తాత్కాలికంగా కాకుండా జీవితాంతం ఉండేలా ఇవి మనకు తోడ్పడతాయి.

అలాకాకుండా ఉపవాసం ఉండి కూడా అబద్ధమాడ టాన్ని, దాన్ని ఆచరించడాన్ని వదిలిపెట్టని మనిషి ఆహార పానీయాలు మానేసి ఆకలిదప్పులతో ఉండటం పట్ల దేవునికి ఏమాత్రం ఆసక్తి లేదని దైవ ప్రవక్త(స) స్పష్టంగా చెప్పారు.

పవిత్ర రమజాన్ నెలలో, ఆ తర్వాత కాలంలో అసత్య మాడటం, అసత్య వ్యవహారాలు నడపటం జీవిత సౌధాన్ని సత్యతా పునాదులపై పునర్నిర్మించడానికి కృషి చేయకపోవటం ధర్మ రాహిత్యంతో కూడిన ప్రస్తుత జీవన వ్యవస్థనే అంటి పెట్టుకుని ఉండటం అనేది, మనం పాటించిన ఉపవాసాల వల్ల ఒరిగిందేమీ లేదని అర్థం. ఈ మాసంతో మనం ఎంత వరకు లబ్ధి పొంద గలిగాం అన్నది తర్వాతనే కదా తెలుస్తోంది.

దైవప్రవక్త(స) సహచరులు రమజాన్ నెల తర్వాత ఆరు మాసాల పాటు తమ ఆరాధనలు స్వీకరించబడాలని ప్రార్థిస్తూ ఉండేవారు. మిగతా నెలలు మరో రమజాన్ నెలను పొందే భాగ్యాన్ని ప్రసాదించాలని దైవాన్ని వేడుకునేవారు.

రమజాన్ తర్వాత మిగిలిన పదకొండు నెలల కాలంలో కూడా ఉపవాసాల ప్రభావం మన జీవితంలోని అన్ని రంగాల్లో గోచరించేటట్లు వీలైనంత వరకు కృషి చేయాలి. అప్పుడే రమజాన్ ఆశయం నెరవేరుతోంది..... ◆

లేఖరాయి

గీటురాయి పత్రికలో వస్తున్న వ్యాసాలపై మీ అభిప్రాయాలు, సలహాలు, సూచనలను geeturaiweekly@gmail.com కు మెయిల్ చేయండి

లేదా

9640622076, 9396706460 నంబర్‌లకు వాట్సప్ చేయండి

మీ లేఖలను 'లేఖరాయి' శీర్షికలో ప్రచురిస్తాం.



# ఖుర్ఆన్‌ను ఎందుకు అధ్యయనం చేయాలి?

- ఆయిషా సుల్తాన

**ఆత్మ** వికాసానికి, ఆధ్యాత్మిక ప్రగతికి, నైతిక పురోభివృద్ధికి, మానవతా వికాసానికి ఒక మహత్తర కానుక, దివ్య ఖుర్ఆన్. దీని అవతరణ మానవాళికి ఒక వరం.

ఖుర్ఆన్ మార్గదర్శక జ్యోతి, ఆ జ్యోతి వెలుగులో జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలి. ఆచరణాత్మకంగా దాని ద్వారా ప్రయోజనాలు పొందాలి.

ఖుర్ఆన్ వ్యక్తిగత జీవితం గురించి మనకు మార్గదర్శనం చేస్తుంది. ఏ విధంగా పరిశుద్ధ జీవితం గడపాలి? ఏ విధానాలు ఆచరిస్తే జీవితం సాఫల్య పథంలో పయనిస్తుంది? వ్యక్తిత్వ వికాసానికి అవలంబించాల్సిన మార్గాలేవి? ఒక పరిపూర్ణ మానవునిగా, మానవతావాదిగా రూపొందాలంటే ఏంచేయాలి? అన్నీ విషయాల్లో మానవుడికి ఖుర్ఆన్ మార్గదర్శనం చేస్తుంది. సామూహిక జీవితానికి కావలసిన మార్గదర్శక సూత్రాలు బోధిస్తుంది. సామూహిక జీవన విధానం ఎలా ఉండాలి? కుటుంబ జీవితం ఎలా గడపాలి? నాగరికత నడవడికలు ఎలా రూపొందాలి? దేశం ఎలాంటి సూత్రాల ప్రాతిపదికన నడవాలి? సామాజిక జీవనవ్యవస్థ, చట్టాలు ఎలా ఉండాలి? దైవంతో సంబంధం ఎలా ఉండాలి? సాటి మానవుల పట్ల సంబంధాలు ఎలా ఉండాలి? భార్యపిల్లలతో, తల్లిదండ్రులతో, బంధుమిత్రులతో ఇరుగుపొరుగు వారితో, సంబంధాలు ఎలా ఉండాలి? చివరికి చెట్లు చేమలు, పశుపక్ష్యాదులు వగైరా దైవం ప్రసాదించిన ప్రతి అనుగ్రహం పట్ల వైఖరి ఎలా ఉండాలి? మొత్తం మీద మానవ జీవితంలో సకల రంగాల్లో దివ్య ఖుర్ఆన్ మనకి స్పష్టమైన మార్గ నిర్దేశనం చేస్తుంది.

ఒక విశ్వాసి చేయవలసింది ఖుర్ఆన్‌ను మార్గదర్శక జ్యోతిగా అంగీకరించి స్వీకరించాలి. ఏ అవసరం వచ్చినా మార్గదర్శకం కోసం దాని వైపుకే మరలాలి. అందులో ఉన్న ప్రతి ఆదేశాన్ని, ప్రతి ఆజ్ఞను త్రికరణశుద్ధితో విశ్వసించి ఆచరించాలి. దానికి వ్యతిరేకంగా ఉన్న ప్రతి విషయాన్ని నిర్ద్వందంగా తృణీకరించాలి.

ప్రవక్తా! వారితో ఇంకా ఇలా చెప్పు : "జిబ్రీల్ పట్ల విరోధం ఉన్న ప్రతివాడూ ఈ యథార్థాన్ని గ్రహించాలి. అల్లాహ్ ఆజ్ఞతోనే అతను ఈ ఖురానును నీ హృదయ ఫలకంపై అవతరింపజేశాడు. పూర్వం వచ్చిన అన్ని గ్రంథాలనూ అది ధ్రువీకరిస్తుంది. అవి నిజమని బలపరుస్తుంది. విశ్వసించే వారికి అది హితోపదేశం సాఫల్యం సిద్ధిస్తుందని తెలిపే శుభవార్త. (2:97)

వాస్తవానికి అల్లాహ్ విశ్వాసులకు మహోపకారం చేశాడు : స్వయంగా వారి నుండే వారి మధ్య ఒక ప్రవక్తను లేపాడు. అతడు ఆయన ఆయతులను వారికి వినిపిస్తాడు. వారి జీవితాలను తీర్చిదిద్దుతాడు. వారికి గ్రంథాన్నీ, వివేకాన్నీ నేర్పుతాడు.

వాస్తవానికి వారు ఇంతకు పూర్వం స్పష్టమయిన అపమార్గాలలో పడివున్నారు. (3:164)

మేము ఈ గ్రంథాన్ని అవతరింపజేశాము. ఇది శుభాలు కల గ్రంథం. కావున మీరు దీనిని అనుసరించండి. భయభక్తుల వైఖరిని అవలంబించండి. మీరు కరుణించబడటం సాధ్యం కావచ్చు. (6:155)

మేము ఈ ప్రజల వద్దకు ఒక గ్రంథాన్ని తీసుకువచ్చాము. దానిని మేము జ్ఞానం ఆధారంగా సవివరమైనదిగా చేశాము. అది విశ్వాసులకు మార్గదర్శకత్వం, కారుణ్యం. (7:52)

మేము ఈ ఖురాను భాగాల అవతరణ క్రమంలో అవతరింప జేస్తున్నటువంటి ప్రతి భాగమూ విశ్వాసులకు స్వస్థత కారుణ్యమునూ. (17:82)

ఇది ఒక గొప్ప వార్త. (38:67)

ఇది ఒక హితబోధ, విశ్వప్రజలందరికినీ. (38:87)

ఈ గ్రంథం మహాశక్తి సంపన్నుడూ, మహా వివేకవంతుడూ అయిన అల్లాహ్ తరఫునుండి అవతరించింది. (39:1)

మేము ఈ ఖురాన్‌లో ప్రజల కొరకు రకరకాల దృష్టాంతాలను ఇచ్చాము, వారు స్పృహలోనికి వస్తారేమో అని. (39:27)

తమ ముందుకు హితబోధ వచ్చినప్పుడు, దానిని విశ్వసించ కుండా తిరస్కరించిన వారు వీరే. కాని యథార్థమేమిటంటే, ఇది ఒక శక్తిమంతమైన గ్రంథం. (41:41)

అసత్యం దాని మీదకు ముందునుండీ రాజాలదు, వెనుకనుండీ రాజాలదు. వివేకవంతుడూ, స్తుతిపాత్రుడూ అయిన దేవుడే అవతరింపజేసిన గ్రంథం ఇది. (41:42)

◆

# జమాఅతె ఇస్లామీ హింద్ కడపలో ఈద్‌మిలాప్

**సర్వమత** సమ్మేళనాలు నేటి అవసరమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.బీ. అంజద్ బాషా అన్నారు. స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఫంక్షన్‌హాల్‌లో పవిత్ర రమజాన్ పండుగ సందర్భంగా జమాఅతె ఇస్లామీ హింద్ కడప శాఖ ఏర్పాటు చేసిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారతదేశం వివిధ మతాలు, కులాలు, జాతుల సంగమమనీ, ఇక్కడ అందరూ కలసి మెలసి జీవనం సాగిస్తారనీ, అందుకే మన దేశం భిన్నత్వంలో ఏకత్వంగా పరిగణించబడుతుందని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలను చేస్తున్నటువంటి జమాఅతెఇస్లామీ హింద్ సంస్థను అభినందించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఇంజనీర్ ఎన్.శ్రీనివాసులు (OSD to Govt.of A.P. Energy Department, APSPDCL, Tirupati) మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి కుల మత భేదం లేకుండా అన్ని మతాల వారు హాజరైనందుకు సంతోషం వ్యక్తం చేశారు. అందరూ కలసి ఒకరి ధర్మాన్ని మరొకరు అర్థం చేసుకున్నప్పుడు మన దేశం ప్రపంచ దేశాల్లోనే ఉన్నత స్థానాలను అధిరోహిస్తుందని తెలిపారు. కార్యక్రమానికి విచ్చేసిన మరొక గౌరవ అతిథి డాక్టర్ బాలిరెడ్డి మాట్లాడుతూ, భారతదేశ ముస్లిములు ఈ దేశం కోసం ఎన్నో త్యాగాలు చేశారన్నారు. జమాఅతె ఇస్లామీ హింద్ రాష్ట్ర కార్యదర్శి ముహమ్మద్ షరీఫ్ ప్రసంగిస్తూ




నేడు మనం దేశ లౌకిక వ్యవస్థను కాపాడుకోవల్సిన అవసర ముందన్నారు. మనిషిలో జవాబుదారీతనాన్ని పెంచడమే ఉపవాస లక్ష్యమని అన్నారు. నేడు మన దేశంలో సస్టైనబుల్ డెవలప్‌మెంట్ (Sustainable Development) జరగాలన్నా మనిషిలో జవాబుదారీతనం (Sence of Accountability) ద్వారానే సాధ్యమని అన్నారు. జమాఅతె ఇస్లామీ హింద్ స్థానిక అధ్యక్షులు జనాబ్ రియాజ్ బాషా జమాఅతె ఇస్లామీ హింద్ చేస్తున్నటువంటి వివిధ సామాజిక, సంఘ సేవా కార్యక్రమాలను గురించి వివరించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు, హైందవ, ముస్లిం, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

**రిపోర్టు :** ఎస్.రియాజ్ బాషా,
స్థానిక అధ్యక్షులు జమాఅతె ఇస్లామీ హింద్,
కడప




## కేంద్ర ప్రభుత్వ తీరుపై సుప్రీంకోర్టు అసహనం

రాష్ట్రస్థాయిలో మైనార్టీలను గుర్తించే అంశంపై కేంద్రం వ్యవహరిస్తున్న తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఒకే అంశంపై మాటలు మారుస్తూ రెండు భిన్నమైన వైఖరులు అవలంబించడం ఏంటని ప్రశ్నించింది. ఈ విషయంలో మూడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు చేసి, తమ వద్దకు రావాలని జస్టిస్ ఎస్కే కౌల్, ఎంఎం సుందరేశ్ ధర్మాసనం ఆదేశించింది. దాదాపు పది రాష్ట్రాల్లో హిందువులకు మైనారిటీ గుర్తింపు ఇవ్వడానికి రాజకీయంగా కేంద్రం పావులు కదుపుతోంది. మార్చి 25న కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వశాఖ కోర్టుకు ఒక అఫిడవిట్‌ను సమర్పిస్తూ, మైనారిటీలను గుర్తించేందుకు కేంద్రానికి, రాష్ట్రాలకు సమానంగా అధికారాలు వుంటాయని స్పష్టం చేసింది. ఈ నెల 9వ తేదీన కేంద్రం తన వైఖరిని మార్చుకుంటూ మరో అఫిడవిట్ అందజేసింది. ఈసారి కేంద్రానికి మాత్రమే మైనారిటీ కమ్యూనిటీని గుర్తించే అధికారం వుంటుందని స్పష్టం చేసింది. దీనిపై సుప్రీం తీవ్రంగా స్పందించింది. ''గత వైఖరికి పూర్తి భిన్నంగా ఈసారి మీ వైఖరి వుంది. ఏం చేయాలో మీకే తెలియడం లేనట్లుంది. చాలా అనిశ్చితి నెలకొంది. ఇలా భిన్న వైఖరులు తీసుకోవడం వల్ల ప్రయోజనం వుండదు. అఫిడవిట్‌లు దాఖలు చేయడానికి ముందుగానే మీరు చర్చలు జరపాలి. ఇది సరికాదు.'' అని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ నేతృత్వంలోని బెంచ్ ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడింది.

## దేశద్రోహం చట్టం అమలుపై సుప్రీం కోర్టు స్టే

అత్యంత వివాదాస్పదమైన రాజద్రోహచట్టంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి కొత్త కేసులు నమోదు చేయవద్దని ఆదేశించింది. ఇప్పటికే నమోదైన కేసులపై చర్యలు తీసుకోవద్దని, విచారణ తాత్కాలికంగా నిలిపివేయాలని న్యాయ స్థానం స్పష్టం చేసింది. మానవ హక్కులు, దేశ సమగ్రత మధ్య సమతుల్యతను పాటించాల్సిన అవసరం కూడా ఉందని అభిప్రాయ పడింది. 124ఎ సెక్షన్ కింద జైల్లో ఉన్నవారు సంబంధిత కోర్టులను ఆశ్రయించవచ్చునని సూచించింది. దేశద్రోహం చట్టం సెక్షన్ 124ఎను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ హిమాకోహ్లీ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. దీనిపై ధర్మాసనం కీలక ఉత్తర్వులు వెలువరించింది. కేంద్ర ప్రభుత్వం పునఃపరిశీలన పూర్తయ్యేవరకు.. ఈ చట్టం అమలుపై స్టే విధించింది. 124ఎ సెక్షన్ కింద ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు పేర్కొంది. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకూ ఈ చట్టం కింద కొత్త కేసులు నమోదు చేయొద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సూచించింది.

## మౌనం వహించడం నేరం

పాలకులు ధరల పెరుగుదలను అస్సలు పట్టించుకోవడం లేదని తెలంగాణ ఎంపీజే (మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్) అధ్యక్షులు ముహమ్మద్ అబ్దుల్ అజీజ్ దుయ్య బట్టారు. నిత్యావసర ధరలు ఆకాశా న్నంటుతున్నా ప్రతిపక్షాలు మౌనం వహిస్తున్నాయని, నామమాత్రంగా నిరసనలు చేపట్టి చేతులు దులుపు కుంటున్నాయన్నారు. రాజకీయ పార్టీలు, సామాజిక, సాంఘిక సంస్థలు కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా ఎందుకు ప్రశ్నించడం లేదని, ఇలా మౌనం వహించడమూ నేరమేనని అన్నారు.



## మోదీ తీరుతో మనకూ అదే గతి?

ప్రస్తుత శ్రీలంక పరిస్థితులను ఉదహరిస్తూ మోదీ ప్రభుత్వంపై పీడీపీ చీఫ్ మహబూబా ముఫ్తీ తీవ్రంగా విరుచుకుపడ్డారు. పొరుగు దేశంలో నెలకొన్న పరిస్థితులు భారత్‌కు మేల్కొలుపు వంటివని వ్యాఖ్యానించారు. విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులపై దేశద్రోహం కేసులు బనాయించడం కొనసాగిస్తే భారత్ పరిస్థితి శ్రీలంక కంటే దిగజారుతుందని మహబూబా ముఫ్తీ హెచ్చరించారు. మైనారిటీలపై దాడుల పట్ల ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

## ఢిల్లీలోని రహదారులు పేర్లు మార్చాలని బీజేపీ పట్టు

ఢిల్లీలోని అక్బర్ రోడ్, హుమయూన్ రోడ్, తుగ్లక్ రోడ్‌ల పేర్లను మార్చాలని ఢిల్లీ బిజెపి చీఫ్ ఆదేశ్ గుప్తా న్యూఢిల్లీ మునిసిపల్ కౌన్సిల్ (ఎన్‌డిఎంసి)కి లేఖ రాశారు. తుగ్లక్ రోడ్‌ను గురు గోవింద్ సింగ్ మార్గ్‌గా, అక్బర్ రోడ్‌ను మహారాణా ప్రతాప్ రోడ్‌గా, ఔరంగ జేబ్ లైన్‌ను అబ్దుల్ కలామ్ లైన్‌గా, హుమయూన్ రోడ్‌ని మహర్షి వాల్మీకి రోడ్‌గా, షాజహాన్ రోడ్‌ని జనరల్ బిపిన్ రావత్‌గా, బాబర్ లైన్‌ని ఖుదీరామ్ బోస్‌గా మార్చాలని ఆ లేఖలో సూచించారు. 2014 బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఈ పేర్ల మార్పు వివాదం కొనసాగుతోంది. ఉత్తరప్రదేశ్ వంటి బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఈ పేర్ల మార్పు పలు వివాదాలకు, చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే.




## దానిష్ సిద్దీఖీకి మరోసారి పులిట్జర్ పురస్కారం

భారత్‌లో కరోనా మరణ మృదంగంపై తీసిన చిత్రాలకు గాను భారత ఫొటోగ్రాఫర్ దానిష్ సిద్దీఖీకి ప్రతిష్ఠాత్మక పులిట్జర్ పురస్కారం దక్కింది. అఫ్ఘనిస్తాన్, తాలిబన్ దాడుల్లో రాయిటర్ ఫొటో గ్రాఫర్ డానిష్ సిద్దీఖీ గత ఏడాది ప్రాణాలు కోల్పోయారు. మరణానంతరం ఆయనకు ఈ పురస్కారం దక్కింది. దానిష్ పులిట్జర్ పురస్కారానికి ఎంపిక కావడం ఇది రెండోసారి కావడం గమనార్హం. 2018లో మయన్మార్‌లోని రోహింగ్యా శరణార్థుల ఫొటోకు తొలి పులిట్జర్ పురస్కారం అందుకున్నారు. మే 9న 2022 సంవత్సరానికి గానూ పులిట్జర్ ప్రైజ్ విజేతలను ప్రకటించారు. ఇందులో ఫీచర్ ఫొటోగ్రఫీలో డానిష్ సిద్దీఖీ, అద్నాన్ అబిదీ, సనా ఇర్షాద్, అమిత్ దవేలను విజేతలుగా ప్రకటించారు. భారత్‌లో కోవిడ్ మరణాలపై వీరు తీసిన చిత్రాలకు గానూ ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు కమిటీ వెల్లడించింది. కరోనా మహమ్మారి సెకండ్ వేవ్‌లో ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో ఢిల్లీలో ఒకేసారి అనేకమంది మరణించడంతో పలు శ్మశాన వాటికల్లో సామూహిక అంత్యక్రియలు చేపట్టారు. అందుకు సంబంధించి సిద్దీఖీ తీసిన ఫొటోలు అప్పట్లో సంచలనంగా మారాయి. ఆ ఫొటోలు ఎంతో మంది హృదయాలను కదలించాయి.

## శ్రీలంక ప్రధాని రాజీనామా...

దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతుండటంతో శ్రీలంక ప్రధాని మహీందా రాజపక్సా తన పదవికి రాజీనామా చేశారు. ప్రధాని రాజీనామాతో కేబినెట్ కూడా రద్దు కానుంది. దేశ రాజధాని కొలంబోలో జరిగిన ఘర్షణల్లో సుమారు 20 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. దీంతో దేశవ్యాప్తంగా నిరవధిక కర్ఫ్యూ విధించారు. ప్రజలు సంయమనం పాటించాలంటూ మహీందా ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌పై శ్రీలంక మాజీ క్రికెటర్ కుమార సంగక్కర స్పందించారు. మీ మద్దతుదారులే ఈ హింసకు కారణమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన చేపడుతున్న ఆందోళనకారులపై మీ గూండాలు, దొంగలు దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. అనంతరం రాజీనామా ప్రకటన వెలువడటం గమనార్హం.

## అల్ జజీరా జర్నలిస్టును చంపిన ఇస్రాయీల్ దళాలు

ఇస్రాయీల్ దళాలు తమ జర్నలిస్ట్ షీరీన్ అబూ ఆఖిలాను చంపినట్లు అల్ జజీరా సంస్థ పేర్కొన్నది. పాలస్తీనా భూభాగంలో పనిచేస్తున్న ఆమెను ఇస్రాయీల్ దళాలు హతమార్చినట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇది చాలా హేయమైన హత్య అని, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి ఇస్రాయీల్ దళాలు క్రూరంగా తమ రిపోర్టర్‌ను చంపినట్లు అల్ జజీరా తెలిపింది. కావాలనే తమ జర్నలిస్టును హత్య చేశారని, దీనికి ఇస్రాయీల్ బాధ్యత తీసుకోవాలని, అంతర్జాతీయ సమాజం ఈ అంశంలో జోక్యం చేసుకోవాలని అల్ జజీరా కోరింది.

## సిరియాకు అమెరికా 800 మిలియన్ డాలర్ల సహాయం

మానవతా దృక్పథంతో సిరియాకు 800 మిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు అమెరికా విదేశాంగ మంత్రి వెల్లడించారు. సిరియా భవిష్యత్తును సుస్థిరం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. సిరియాలో యుద్ధం వల్ల ప్రభావితు లైన వారికి సహాయం చేయడం తమ ప్రథమ లక్ష్యం అన్నారు. సిరియాలో పదేళ్ళ నుంచి యుద్ధం జరుగుతోంది. సిరియనులు ఇబ్బందుల్లో ఉన్నారు. ఆకలికి అలమటిస్తున్నారు. వారికి వైద్య సహాయం సరిగ్గా అందడం లేదు. కనుక వారిని ఆదుకునేందుకు భారీ ఆర్థిక సహాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎక్కడ అవసరార్థులు ఉన్నా తాము సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు.


## పౌరసత్వం వదులుకున్న 7 లక్షల మంది భారతీయులు

గత 6 ఏళ్లలో సుమారు 7లక్షల కంటే ఎక్కువ మంది పౌరులు భారతీయ పౌరసత్వాన్ని వదులుకున్నట్లు కేంద్రం తాజాగా ప్రకటించింది. 2016 నుంచి ఇప్పటివరకు ఏడున్నర లక్షల మంది దేశ పౌరసత్వాన్ని వదులుకోగా, దాదాపు 6వేల మంది విదేశీయులు భారత పౌరసత్వం తీసుకున్నారని కేంద్రం వెల్లడించింది. 2016-21 మధ్య డేటా ప్రకారం రాజ్యసభలో కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ఈ విషయాన్ని తెలియజేసింది. మంత్రిత్వ శాఖ సమర్పించిన డేటా ప్రకారం 7,49,765 మంది పౌరులు భారత పౌరసత్వాన్ని వదులుకుని 106 దేశాల్లో స్థిరపడ్డారు. 2019లో అత్యధికంగా 1,44,017 మంది పౌరసత్వం వదులు కున్నారు. ఆ తర్వాత వరుసగా 2016లో 1,41,603 మంది, 2017లో 1,33,049 మంది, 2018లో 1,34,561 మంది, 2020లో 85,248 మంది, 2021లో 1,11,287 మంది భారత పౌరసత్వాన్ని వదులుకోవడం జరిగింది.

# మోసకారులకు 'హావియా' నరకం

నుస్రత్ ఫాతిమా

**ఒకసారి** ప్రవక్త (స) మార్కెట్లో సరుకులు కొనేందుకు వెళ్లారు. అక్కడ ఒకచోట వ్యాపారి ఆహార పదార్థాలు కుప్పగా పోసి అమ్ముతున్నాడు. అందులో చేయి లోపలికి పెట్టి పరిశీలనగా చూశారు. పైన మాత్రం పొడిగా ఉన్నప్పటికీ లోనంతా తడిగా ఉండటాన్ని చూసి వ్యాపారిని మందలించారు. ఇలా మోసం చేసి ప్రజలను సొమ్ము చేసుకోవడం ధర్మ నిషిద్ధమన్నారు. 'మోసం చేసేవాడు నా సమాజంలోనివాడు కాదు' అన్నారు. ప్రవక్త (స) ఏనాడు నమాజు, రోజా, జకాత్, హజ్‌ను త్యజించేవారి విషయంలో కూడా ఇంతగా ఆగ్రహించలేదు. మోసకారుల పర్యవసానాన్ని వివరిస్తూ ఖుర్‌ఆన్‌లో ఎన్నో హెచ్చరికలున్నాయి. "తూనికలలో, కొలతలలో తగ్గించి ఇచ్చేవారికి వినాశం ఉన్నది. వారు ప్రజల నుండి తీసుకునేటప్పుడు పూర్తిగా తీసుకుంటారు. కొలిచిగాని తూచిగాని ఇచ్చేటప్పుడు తగ్గించి ఇస్తారు. ఒక మహాదినంనాడు వారు బ్రతికించి తీసుకురాబడనున్నారని వారికి తెలియదా?" అని ఖుర్‌ఆన్ హెచ్చరిక. 'మోసకారి ఏదో ఒకరోజు మోసపోవడం ఖాయం. ఎదుటివారి కీడు గురించి ఆలోచించేవారికి తప్పకుండా కీడు జరిగి తీరుతుంది' అన్నది ఖుర్‌ఆన్ ఉద్బోధ. ప్రపంచంలో మనకు లభించే అనుగ్రహాలన్నీ మోసపూరితమే. పేరు, ప్రతిష్టలు, డబ్బు, పేదరికం, గౌరవ మర్యాదలు, ఇవన్నీ మన బొందిలో ప్రాణమున్నంత వరకే. తాత్కాలికమైన ఈ సౌఖ్యాల కోసం ఎదుటి వారిని మోసగించడం అవివేకమే అంటారు ఉలమాలు. నిజమైన విశ్వాసి ఎవరినీ మోసం చేయడు. ఒకరి సొమ్మును అక్రమంగా కాజేయడు అని ఖుర్‌ఆన్ దైవదాసుల గుణగణాల గురించి వివరిస్తుంది. తమ కుటుంబాన్ని పోషించుకోవడానికి ఎవరైతే చెమటోడ్చుతారో అలాంటి వారిపై అల్లాహ్ కారుణ్యం కురిపిస్తాడు. మరెవరైతే ఇతరులను మోసపుచ్చి సొమ్ముచేసుకుంటారో అలాంటి వారి ఇంట్లో శాంతి, సంతృప్తులు కరువవుతాయి. ఎంత డబ్బు, ఎన్ని విలాసాలున్నా మనశ్శాంతి లేని జీవితం గడుపుతారు అన్నది ఇస్లామ్ బోధనల సారాంశం. మోసకారులను అల్లాహ్ కరుణించడు. 'ఆయన కన్నులలోని మోసాన్ని, గుండెల్లోని గుట్టును సయితం బాగా ఎరుగును' అని మోసకారులారా తస్మాత్ జాగ్రత్త అని ఖుర్‌ఆన్ ఘోషిస్తుంది. 'దేవా! నన్ను నమ్మకద్రోహం నుండి కాపాడు. అది మహా చెడ్డ అంతర్గత సావాసి' అని ప్రవక్త (స) వేడుకునేవారు. ప్రళయ దినాన మోసకారులను హాజరుపరుస్తారు. 'నీవు మోసం చేసి కాజేసిన ఆ సొమ్మును తెచ్చివ్వు" అని అంటాడు అల్లాహ్. 'ఓ రాజాధి రాజా! నేనెక్కడి నుండి తెచ్చివ్వను? ప్రాపంచిక జీవితం అంతమైపోయింది కదా!' అని ప్రాధేయపడతాడు. 'ఇతన్ని నరకంలోని 'హావియా' శ్రేణిలోకి తీసుకెళ్లండి' అని ఆదేశిస్తాడు అల్లాహ్. అక్కడ ఆ మోసపుచ్చి సొంతం చేసుకున్న వస్తువు అసలు రూపంలో ముందుకు వస్తుంది. దానిని చూడగానే అతను గుర్తుపడతాడు. దాని వెనుక పడతాడు. ఎట్టకేలకు దానిని వెంబడించి పట్టుకుని, తన భుజాలపై వేసుకుని నరకం నుండి బయట పడాలనుకుంటాడు. అప్పుడు ఆ బరువు అతని భుజంపై నుండి జారి క్రిందపడుతుంది. అతని మళ్లీ దానిని వెంబడిస్తాడు. ఇది అతని నిత్యకృత్యమైపోతుంది. 'ప్రళయదినాన అల్లాహ్ మోసకారుల వైపు కన్నెత్తి కూడా చూడడు' అని ప్రవక్త (స) చెప్పారు. ప్రవక్త బోధనల గ్రంథం సహీహ్ బుఖారిలో 'రజాయిల్' అధ్యాయంలో మోసకారుల పర్యవసానాల గురించి ఎన్నో హెచ్చరికలున్నాయి.




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**